ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.1	26.9
కావలి	35	26
ఆత్మకూరు	36	25
ఉదయగిరి	37	25
కందుకూరు	36	27



స్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై నిర్మాణాలు



ప్రధాన రైల్వేస్టేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రధాన భవనం



నయా స్టేషన్ ఆగయా

- సకల సౌకర్యాలతో ముస్తాబవుతున్న నెల్లూరు రైల్వేస్టేషన్
- పునరాభివృద్ధి పథకం ద్వారా రూ.102 కోట్లతో పనులు
- మరో రెండు నెలల్లో పూర్తిగా అందుబాటులోకి..

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. స్టేషన్‌కు తూర్పు, పడమర రెండు వైపులా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. పునరాభివృద్ధి పథకం ద్వారా సుమారు రూ.102 కోట్లతో జరుగుతున్న ఈ పనులు 80 శాతం పూర్తవగా, రెండు నెలల్లో సంపూర్ణంగా పూర్తి చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైల్వేస్టేషన్లలో ప్రధానంగా నెల్లూరు రైల్వేస్టేషన్ ఒకటి. నిత్యం 30వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేజ్-3లో ఉన్న నెల్లూరు స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు 2019లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రైల్వేమంత్రి పియూష్ గోయల్ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కరోనా ఇతర కారణాల వల్ల ఈ పునరాభివృద్ధి పనులను 2022లో ప్రారంభించారు. ఈపీసీ విధానంలో హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ ఎస్‌సీఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ ఈ పనులు చేపట్టగా, 2024, మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకొన్నారు. అయినా ఇప్పటికీ సాగుతున్నాయి. 2025, జూన్ నెలకల్లా పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.



ప్రత్యేకతలు ఇవీ..

నెల్లూరు స్టేషన్‌లో తూర్పు, పడమర వైపు రెండు మార్గాలు ఉన్నాయి. స్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫారాలు కలుపుతూ అండర్ పాస్‌ను నిర్మించారు. ఇది ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అదేవిధంగా నాలుగు ప్లాట్‌ఫారాలను కలుపుతూ నిర్మిస్తున్న విశాలమైన ఎయిర్ కాంకోర్స్ పూర్తికావస్తోంది. దీనివల్ల ఎంతోమంది ప్రయాణికులు ఒకేసారి రాకపోకలు సాగించవచ్చు.



రైల్వే ప్రయాణికులకు సరికొత్త ప్రపంచం



అండర్‌పాస్ ఇదే..

దీనికి అనుసంధానంగా నాలుగు లిఫ్టులు, మరో నాలుగు ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రెండు వైపులా మూడంతస్తుల భవనాలు రెండింటిని నిర్మిస్తున్నారు. వీటిలో వాణిజ్య సముదాయాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, రైల్వే సిబ్బందికి అనుకూలంగా గదులు, రైల్వే కార్యాలయాలు ఉంటాయి. అలాగే పడమర వైపు రైల్వేకోర్టు, జీఆర్‌పీ కార్యాలయాలు కూడా నిర్మాణంలో ఉన్నాయి. స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫారాల పొడవును ఆత్మకూరు బస్టాండ్‌వైపు పెంచారు. ప్లాట్‌ఫారాలను మార్బుల్స్‌తో అందంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇక స్టేషన్‌కు సరిపడినంత నీటి నిల్వల కోసం 6లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్‌లెవల్ రిజర్వాయర్ నిర్మించారు. ఇలా అన్ని నిర్మాణాలు పూర్తయ్యాక రైల్వేస్టేషన్ మొత్తం పచ్చదనం నింపేందుకు మొక్కలను కూడా పెంచనున్నారు. మొత్తానికి పునరాభివృద్ధి పనులతో నెల్లూరు రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోతున్నాయి. ఇప్పటిదాకా ఉన్న స్టేషన్ వేరు.. రానున్న రెండు నెలల తర్వాత స్టేషన్‌వేరు అన్నస్థాయిలో ముస్తాబవుతోంది.

జూనియర్ కళాశాలల

ప్రిన్సిపాళ్ల సమావేశం నేడు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నడు స్తున్న జూనియర్ కళాశాలల ప్రధాన అధ్యా పకుల సమావేశాన్ని గురువారం నెల్లూరు లోని డీకేడబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల యూడైస్ ప్లస్ డేటా ను పూర్తి చేయడం, మాదక ద్రవ్యాల విని యోగానికి వ్యతిరేకంగా కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవ త్సరంలో ప్రవేశపెడుతున్న వివిధ సంస్కర ణలపై అవగాహన కల్పిస్తామని, ప్రిన్సిపాళ్లు అందరూ ఉదయం 10 గంటలకు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

నేటితో టెన్త్ మూల్యాంకనం పూర్తి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాం కనం గురువారంతో పూర్తికానుంది. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈనెల బుధ వారంతో మూల్యాంకనాన్ని పూర్తి చేయాల్సి ఉంది. అయితే రంజాన్ పండుగ నేపథ్యంలో సోషల్ పరీక్షను ఒకరోజు ఆలస్యంగా నిర్వ హించడంతో మూల్యాంకనం కూడా ఒకరోజు ఆలస్యమవుతోంది. నగరంలోని పొదలకూ రు రోడ్డు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 3 నుంచి స్పాట్ వాల్యూయేషన్ జరుగుతున్న విషయం విదితమే. జిల్లాకు 1,90,520 జవాబు పత్రాలు రావడంతో మూల్యాంక నానికి రెండు వేల మందిని నియమించారు. ఓఎంఆర్‌లో పార్ట్-3 పత్రాలను బండిల్స్ చేసి ఏరోజుకారోజు విజయవాడలోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపించారు.

సీజన్ వస్తోంది..

పూడికతీత ఎప్పుడో!?

నెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రెండో పంట సీజన్ మొదలైనా కాలువల్లో మాత్రం పూడిక తొలగడం లేదు. వారం రోజుల్లో ఐఏబీ నిర్వహించి, వచ్చే నెల 1వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని ప్రణాళిక రూపొం దించుకున్నారు. అయినా ఇంతవరకూ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) పనులకు అనుమతులు లభించలే దు. దీంతో ఎప్పుడు పనులు చేస్తారని.. రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

- వచ్చే నెల 1 నుంచి రెండో పంటకు నీరు విడుదల
- ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- మొదలుకాని కాలువల్లో పూడికతీత పనులు
- ఇంతవరకూ ఓఅండ్ఎం వర్కులకు రాని అనుమతులు

రెండేళ్ల తర్వాత ఇప్పుడు రెండో పంట సాగు జరుగుతోంది. గతేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో మొదటి పంటకు పోను ఇంకా సోమశిల, కండలేరు జలాశయాల్లో 50 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉంది. ఈ నీటితో రానున్న సీజన్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో సాగుకు నీరిచ్చేందుకు నిర్ణయించారు. ఒక్క సోమశిల కిందనే 3.70 లక్షల ఎకరాలకు సాగునీటి కేటాయింపులు జరిపేలా ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలను సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆమోదించడమే తరువాయి. మే 1 నుంచి నీటిని విడుదల చేస్తే గానీ సెప్టెంబరులోపు వరికోతలు పూర్తికావు. ఆ తర్వాత వర్షాకాల సీజన్ మొదలవుతుంది. దీంతో రైతాంగం రెండో పంటకు సన్నద్ధమవుతోంది. మొదటి పంట పూర్తి కాగా ఆ సమయంలో నీటి పారుదలతో కాలువలు పూడిక, గుర్రపుడెక్కతో నిండిపోయాయి. నీటి విడుదల మొదలుపెట్టేలోపు ఈ కాలువల్లో పూడిక తొలగించాల్సి ఉంది.



ఇందుకూరుపేట : ఆరో మైలు వద్ద పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయిన గంగపట్నం కాలువ

ఇందుకుగానూ ఇరిగేషన్ అధికారులు ఓఅండ్ఎం పనుల కోసం రూ.144 కోట్లతో 1419 వర్కులను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఈ ప్రతిపాదనలకు ఇంతవరకూ ఆమోద ముద్ర లభించలేదు. మొదటి పంట సమయంలో కూడా ఓఅండ్ఎం పనులకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పంపినా చివరకు రూ.38 కోట్లకే అనుమతులు లభించాయి. అప్పుడు కూడా అనుమతులు ఆలస్యం కావడంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే గత సీజన్‌లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అధికారులు.. అవేవీ పట్టించుకోవడం లేదు. కాలువల్లో నీరు సాఫీగా పారకపోతే చివరి ఆయకట్టు వరకూ నీరందడం కష్టంగా మారుతుంది. ఇప్పటికిప్పుడు అనుమతులు ఇస్తే గానీ నీరు విడుదల చేసే నాటికి కాలువలను బాగు చేయడం సాధ్యపడదు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా కాలువల్లో పూడికతీతపై సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా రెండో పంటకు సంబంధించి ఓఅండ్ఎం పనుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఇంకా అనుమతులు రాలేదని, రాగానే రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

కాకాణి

అజ్ఞాతం వీడేనా!?

నెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడిచిన రెండు వారాలుగా అజ్ఞాతంలో ఉన్నారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో కాకాణిని నిందితుడిగా చేర్చినప్పటి నుంచి పత్తా లేకుండా పోయారు. విచారణకు రావాలంటూ మూడుసార్లు పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లినా ఎక్కడా కాకాణి జాడ కనిపించలేదు. పోలీసుల విచారణకు కూడా హాజరుకాలేదు. అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా అక్కడ గోవర్ధన్‌రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కాకాణి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మరి ఇప్పటికైనా ఆయన అజ్ఞాతం వీడి బయటకు వస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పోలీసులు కూడా కాకాణి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. కొన్ని బృందాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లోనూ తిరిగినప్పటికీ కాకాణి ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వ్యక్తి.. నేడు అక్రమాలు బయటకొచ్చే సరికి తప్పించుకొని తిరుగుతున్నాడంటూ చర్చించుకుంటున్నారు. కాగా మరోవైపు జిల్లాలోని వైసీపీ నాయకులు మాత్రం నిత్యం ప్రెస్‌మీట్లు పెడుతూ కాకాణి పారిపోలేదని చెబుతున్నారు. మరి ఆయనెక్కడున్నారో మాత్రం చెప్పడం లేదు. నిత్యం అధికార పార్టీ నేతలపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతూ ఉండే కాకాణి.. గడిచిన వారం రోజులుగా ఒక్క మెసేజ్ కూడా పెట్టకపోవడం ఆయన పరారీలో ఉన్నారన్న ప్రచారానికి బలం చేకూరుస్తోంది.





రైల్వే శాఖలో ఆయనో రిటైర్డు ఉద్యోగి. పేరు జొన్నాదుల కోటేశ్వరరావు. నెల్లూరు నగరవాసి. విధుల్లో ఉన్నప్పుడే కాదు.. ఉద్యోగ విరమణ పొందాక కూడా ఆంధ్రజ్యోతి పత్రికను చదవడం ఆయన మానలేదు. ఒకరకంగా చెప్పాలంటే కోటేశ్వరరావుకు ఆంధ్రజ్యోతి ఓ స్నేహితుడిగా మారిపోయింది. ఏళ్ల తరబడి తనను ఆదరిస్తున్న ఆంధ్రజ్యోతి కూడా తన స్నేహితుడికి మరపురాని బహుమతిని అందించింది. పాఠకుల కోసం ఈ ఏడాది ప్రవేశపెట్టిన 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీడిప్‌లో విజేతగా నిలిపి కారును అందజేసింది. విజయవాడలో బుధవారం జరిగిన లక్కీడిప్‌లో కారు గెలుచుకున్నట్టు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ స్వయంగా ఫోన్ చేసి అభినందించడంతో కోటేశ్వరరావు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

\- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

మిత్రమా.. కారు అందుకో!

- 'ఆంధ్రజ్యోతి' చిరకాల పాఠకుడికి ఊహించని బహుమతి
- 'కార్ అండ్ బైక్ రేస్' విజేతగా నెల్లూరువాసి
- కోటేశ్వరరావును వరించిన అదృష్టం
- స్వయంగా ఫోన్ చేసి అభినందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్



నెల్లూరులోని సంతపేట, నాలుగుకాళ్ల మండపం సమీపంలో జొన్నాదుల కోటేశ్వరరావు ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కొడుకులు, ఓ కుమార్తె సంతానం. రైల్వేశాఖలో టికెట్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ 2006లో ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లోనేకాదు.. రిటైర్డు అయినా కోటేశ్వరరావు మాత్రం ఆంధ్రజ్యోతి పత్రికను చదవడం మానలేదు. మార్కెట్‌లో పత్రికను కొనుగోలు చేసి ఇంటికి తీసుకొస్తుంటారు. తన తండ్రి తీసుకువచ్చి చదివి పక్కన పెట్టిన పత్రికలోని లక్కీడిప్ కూపన్లను చిన్న కుమారుడు రవి జాగ్రత్తగా కత్తరించి వాటిని ఆంధ్రజ్యోతి కార్యాలయంలోని బాక్సులో వేసేవారు. ఎన్నో సంవత్సరాలుగా క్రమం తప్పకుండా కూపన్లను వేసి లక్కీడిప్ కోసం ఎదురుచూసేవారు. చివరకు రాష్ట్రంలో లక్షలాది మందిలో కార్ విజేతగా కోటేశ్వరరావు నిలిచారు.

సంతోషంగా కారులో తిరుగుతా

నాకు లక్కీడిప్‌లో కారు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. నా కుమారుడు ప్రతి సంవత్సరం కూపన్లు కట్ చేసి ఆంధ్రజ్యోతి జిల్లా కార్యాలయానికి వెళ్లి బాక్సులో వేసి వచ్చేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఫోన్ చేసి కారు గెలుచుకున్నట్లు చెప్పగానే ఆశ్చర్యపోయాను. నాకు సైకిల్ తొక్కడం మాత్రమే వచ్చు. ఈ మధ్య ఆరోగ్యం సహకరించక పోవడంతో సైకిల్ తొక్కలేక పక్కన పెట్టేశాను. ఇప్పుడు నాకు దేవుడు ఆంధ్రజ్యోతి రూపంలో కారును ఇస్తున్నాడు. నా బిడ్డలు, మనమళ్లు, మనమరాళ్లతో కలిసి కారు ముందు సీటులో కూర్చొని నెల్లూరు అంతా తిరుగుతా. నా స్నేహితులతో కలిసి కారులో కూర్చొని ఆంధ్రజ్యోతిని చదువుతూ పత్రికలోని వార్తలు గురించి చర్చించుకుంటూ ఇది ఆంధ్రజ్యోతి నాకు ఇచ్చిన కారు అని అందరికీ చెప్పుకుంటా.

\- కోటేశ్వరరావు, కారు విజేత, నెల్లూరు

- ఎనలేని అభిమానం

కోటేశ్వరరావు ఉద్యోగం చేస్తున్నప్పుడే సమయం దొరికనప్పుడు ఆంధ్రజ్యోతి పత్రికను ఎంతో ఇష్టంగా చదివేవారు. పదవీ విరమణ పొందాక కూడా ఉదయం నిద్రలేచిన వెంటనే వాకింగ్‌కు వెళ్లి సంతపేట సెంటర్‌లో ఆంధ్రజ్యోతి పత్రికను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువచ్చేవారు. పత్రికను పూర్తిగా చదివేవారు. అందులో వచ్చిన అంశాలను కూడా కుటుంబసభ్యులతో పంచుకునేవారు. స్నేహితులు ఇంటికి వచ్చిన సమయంలో ఏబీఎన్‌లో వార్తలు పెట్టుకొని వాటి గురించి చర్చించుకునేవారు. ప్రధానంగా ఆదివారం ఆంధ్రజ్యోతిలో వేమూరి రాధాకృష్ణ ప్రత్యేకంగా రాసే కొత్త పలుకులును కోటేశ్వరరావు ఆసక్తిగా చదువుతూ ఎంతోమందికి చెబుతూ ఉండేవారు. ఇలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌లతో కోటేశ్వరరావుకు తెలియని బంధం ముడివేసుకుంది. ఇదిలా ఉండగా పెద్ద కుమారుడు గుండెపోటుతో మృతి చెందడం, భార్య చంద్రావతమ్మ అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందడంతో కోటేశ్వరరావు మరింతగా దిగాలు చెందారు. ఆ సమయంలోనే ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతూ ఒంటరితనం నుంచి బయటకు రావడం ప్రారంభించారు.



నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను 9959225645 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8,617
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ.96.20

న్యూస్ బాక్స్

శేష వాహనంపై సీతారాముల గ్రామోత్సవం



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల స్వామివార్లను శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు కాయా కర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆంద్రావారిపల్లిలో గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

వింజమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబెల్లిపాలెం గ్రామంలో వున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభించారు. ముందుగా గణపతి పూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం చేసి హోమాలను జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ గావించారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

ఆత్మకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ పి అనూష కుమారి, డాక్టర్ దేవానంద్ బుధవారం ఫైలేరియా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ ఖాదర్‌బాషా, వైద్య సిబ్బంది బి శైలజ, టి చెంచునాగేంద్ర పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 472 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 405 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 67 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 230 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

మర్రిపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భూమి ఉన్న ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. బుధవారం డీసీ పల్లి సచివాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తింపు సంఖ్యను ఇస్తుందని, అందుకు ప్రతీరైతు తమ ఆధార్, పాస్‌బుక్ తీసుకొని సచివాలయంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సీతారామపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వప్న సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు పలు రకాల పరీక్షలు మందులు అందజేశారు. కార్య క్రమంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు త్వరలో పూర్తి

ఉదయగిరి, ఏప్రిల్ 9బ (ఆంధ్రజ్యోతి): గ్రామ కొలను పథకంలో భాగంగా ఆత్మకూరు డివిజన్‌లో జరుగుతున్న చెరువుల సుందరీకరణ పనులను త్వరలో పూర్తిచేస్తామని జలవనరుల శాఖ ఈఈ గాలి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం డీఈ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల ఆవరణలో అగ్నిప్రమాదం

ఉదయగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఆవరణలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కళాశాల ఆవరణలో ఉన్న గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించి పలు రకాల చెట్లు దగ్ధమయ్యాయి. గమనించిన సిబ్బంది, విద్యార్థులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అనంతరం కళాశాల యాజమాన్యం ఉదయగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

తూకంలో మోసం, తరుగు పేరిట దోపిడీ

- లాభపడుతున్న దళారులు
- నష్టపోతున్న అన్నదాతలు

అనంతసాగరం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూకంలో మోసం, తరుగు పేరిట దోపిడీకి గురవుతున్నామని, వ్యాపారులు, దళారులు బాగుపడుతున్నారు తప్ప లాభం చేకూరడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈసారి సోమశిల, కండలేరు, కలిగిరి జలాశయాలతో పాటు సంగం, నెల్లూరు బ్యారేజీల్లో నీరు పుష్కలంగా ఉండడంతో భూగర్భజలాలు పెరిగి బోర్లు, చెరువులు, కాలువల కింద సుమారు ఐదు లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇక దిగుబడి పరిస్థితి మూడు పుట్లకు మించలేదు. ఈక్రమంలో ప్రస్తుతం ఉన్న ధరలతో పోల్చితే పెట్టుబడి పోను మిగిలేది అరకొర మాత్రమే.

వ్యాపారులు, దళారుల దోపిడీ

ఇదిలా ఉంటే జిల్లావ్యాప్తంగా వ్యాపారులు, దళారులు ధాన్యం కొనుగోళ్లలో పైచేయి సాధించారు. ధాన్యం ధరల్లో రోజుకు ఒక రేటు చెప్పి కొనుగోళ్లు సాగించగా ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా దిగుబడిని నిలువచేసుకొనే వెసులుబాటు లేక రైతులు కల్లాల్లోనే అమ్ముకోవల్సిన దుస్థితి ఏర్పడింది. బస్తాకు 74 కేజీలతో సేకరించి అందులో బస్తా బరువు 2 కేజీలు, తేమ ఇతర కారణాలు చెప్పి మరో 2 నుంచి 3 కేజీల ధాన్యం దోపిడీకి పాల్పడుతున్నారు. ఇక కాటాపై అవగాహన లేని వారికైతే బస్తాపై 10 కేజీలకు కూడా దోచేస్తున్న పరిస్థితి నెలకొంది.



లారీకి ధాన్యం లోడు చేస్తున్న కూలీలు

కాగా, ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నా తూనికలు, కొలతల శాఖ అధికారులు పత్తా లేరు. తనిఖీలు చేసి వ్యాపారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అనంతసాగరం మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వంట సాగు చేయగా అన్ని గ్రామాల్లో వ్యాపారులు తమ చేతివాటం ప్రదర్శించి రైతులను దగాచేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆరుగాలం కష్టించిన తమకు పంట చేతికందిన తర్వాత నష్టం తప్ప ఆదాయం లేదంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సింహ వాహనంపై సంగమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు సింహ వాహనంపై సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సింహ వాహనంపై ఉంచి సంగం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బలిజసంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ జి గిరిబాబు పర్యవేక్షించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం ఉదయం వీరభద్రస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం తరఫున వీరభద్రస్వామి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం కమిటీ ఛైర్మన్ మాఘం గిరిబాబు, ధనలక్ష్మి దంపతులు తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

సంగమేశ్వరుడి రథం పరిశీలన

సంగమేశ్వరస్వామి రథాన్ని ఆర్అండ్‌బీ అధికారి అన్వేష్ బుధవారం పరిశీలించారు. ఈనెల 12వ తేదీన సంగమేశ్వరుడి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆర్అండ్‌బీ అధికారి రథాన్ని పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చిన తరువాతనే రథోత్సవం నిర్వహించాల్సి ఉంది. ఆమేరకు ఆయన పరిశీలించి రథోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు లేవని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్త కోటు వెకంట కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్ట వద్ద బస్సుల నిలుపుదల

సంగం-పొదలకూరు రూట్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను బుధవారం నుంచి ఆనకట్ట వద్దే నిలుపుదల చేస్తున్నారు. సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వల్ల ఆలయం ముందు అంగళ్లు ఏర్పాటుచేయడంతో బస్సులు తిప్పుకునేందుకు ఆటంకంగా మారింది. దీంతో ఆనకట్ట వద్ద బస్సులు నిలుపుదల చేస్తున్నట్లు ప్రయాణికులు సహకరించాలని ఆర్టీసి సిబ్బంది కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి : బీజేపీ



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నా టి ఆంజనేయరెడ్డి, కాకి విజయలక్ష్మీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక త్రికోటేశ్వరి కల్యాణ మండపంలో బిజెపి ఆత్మకూరు నియోజకవర్గం క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, సీనియర్ నాయకులు కె నాగరాజారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: బెల్లంకొండ

●ఉదయగిరి : గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆపార్టీ జిల్లా నాయకుడు బెల్లంకొండ మాల్యాద్రి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయిబాబా ఆలయ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన క్రియాశీలక సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణగౌడ్, బ్రహ్మారెడ్డి, గడ్డం ప్రసాద్, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారం పనిచేసినట్లయితే పూర్తివేతనం పొందవచ్చని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని బండారుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వస్తే 11 గంటలలోపు కేటాయించిన పనిని పూర్తిచేయడానికి వీలవుతుందని తెలిపారు. బండారుపల్లిలో ఉపాధి కూలీల కోసం ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పశువుల తొట్లు త్వరగా పూర్తిచేయాలి : ఏపీవో

●సీతారామపురం: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఏపీవో శ్యామల అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మండల పరిధిలో మంజూరైన పశువుల తొట్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, పని దినాలను పెంచాలని సూచించారు. అనంతరం పాండ్రంగి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పాడి పశువుల పెంపకానికి అనువుగా మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిఏలు మురళి, రంగనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, జగదీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్ల నిషేధం

సంగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ సంగంలో బుధవారం నుంచి ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసయ్య, కిషోర్, జరీనాతాజ్ బేగం దుకాణదారులకు నోటీసులు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తున్నట్లు తెలిపారు. 200 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న కవర్లనే వినియోగించాలని దుకాణదారులకు సూచించారు. ప్రజలు సరుకులకు వచ్చేటప్పుడు ఇంటి నుంచి సంచులు తీసుకొచ్చుకోవాలని, నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ. 2వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా బస్టాండ్‌లోని దుకాణదారులు చెత్తను రోడ్డుపై వేయకుండా దుకాణం ముందు డస్ట్‌బిన్ ఏర్పాటుచేసుకుని అందులో వేయాలన్నారు. చెత్త సేకరణకు పంచాయతీ ట్రాక్టర్ వచ్చినపుడు అందులో వేయాలని సూచించారు.

గ్యాస్ ధర పెంపు ఉపసంహరించుకోవాలి : సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు

ఆత్మకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో పెంచిన గ్యా స్ ధరలను తక్షణమే ఉపసంహ రించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లను తాళ్లతో మెడకు బిగించుకుని ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్య దర్శి కె డేవిడ్‌రాజు, ఐద్వా పట్టణ కార్యదర్శి గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్యాస్ ధర తగ్గించే వరకు సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ధరల పెంపుపై ఎన్డీఏ కూటమి నేతలు నోరుమెదపకపోవడం బాధా కరమ న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గంటా లక్ష్మీపతి, పట్టణ సభ్యులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ షేక్ సందాని, ఆళ్ల హజరత్తయ్య, పి యస్థానీ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టసవరణ బిల్లును రద్దుచేయాలి

ఉదయగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) రాజ్యాంగానికి విరుద్ధంగా ఆమోదించిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును రద్దుచేయాలని కోరు తూ జాతీయ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ సమీ హుసేనీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పెద్దమసీదు ఆవరణలో మసీదుల, ముస్లిం మతపెద్దలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ బిల్లును ఆమో దించడం దారుణమన్నారు. బిల్లు రద్దుకు పోరా టాలను ఉధృతం చేస్తామని, రద్దు చేయకపోతే 2029 ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపుతామన్నారు. బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న నెల్లూరులో నిర్వహించే శాంతియుత నిరసన ర్యాలీలో జిల్లాలోని ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్య క్రమంలో ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సయ్యద్ సమీహుసేనీ

1500 టన్నుల జొన్నల కొనుగోలు లక్ష్యం

కలువాయి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన 1500 టన్నుల జొన్నలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. కలువాయి మండలం తోపుగుంటలో బుధవారం ఆయన జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000 ఎకరాల్లో రైతులు జొన్న సాగుచేశారని, 1500 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటం రూ.3371కు కొనుగోలుచేసి 24 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అసిస్టెంట్ మెనేజర్ లక్ష్మీనరసింహ, టీడీపీ నాయకులు జీ వెంకటేశ్వర్లు నాయడు, చల్లా రఘురామిరెడ్డి, జీ చంద్రమౌళి, జీ హరిబాబు, విజయ భాస్కర్ రెడ్డి, నాపా మాధవ నాయడు, మండల వ్యవసాయ శాఖ అధికారి వీ ప్రతాప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

ఆరోగ్య భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

ఉదయగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భద్రతపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో సునీత పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని యాదవపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ పిల్లల్లో ఊబకాయం తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 22వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ తేజస్విని, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

●దుత్తలూరులో: మండలంలోని రెడ్లదిన్నె ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సూపర్‌వైజర్ షేక్ షాను తల్లులు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భోగ్యం సరస్వతి, జయమ్మ, అన్నపూర్ణ, విజయకుమారి, ప్రమీల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

CRIME NEWS

పెన్నాలో దూకి వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పెన్నా బ్యారేజీ వద్ద బుధవారం ఒక వివాహిత నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రంగనాయకులపేట ముస్లింవీధికి చెందిన సల్మా(38)కు నాల్గోమైలుకు చెందిన అఫ్జల్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆమె కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. బుధవారం రంగనాయకులపేటలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. వారు లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయి పెన్నాబ్యారేజ్ వద్ద నదిలో దూకింది. స్థానికులు గమనించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో సల్మా కోసం గాలించారు. కొద్ది సేపటికి సల్మా మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న సల్మా తల్లిదండ్రులు, భర్త అక్కడకు చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని విజయమహల్ గేటు సమీపంలో బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహం కుడి చేతిపై అమ్మ, ఓం అనే పచ్చబొట్లు ఉన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక..

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతీ నగర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న జింకను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... తాగునీటి కోసం సరస్వతీ నగర్ గ్రామంలోకి వచ్చేందుకు జింక రహదారి దాటుతుండగా వాహనం ఢీకొంది. ఈ విషయాన్ని స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వచ్చి జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై దాడి



డ్రైవర్‌పై దాడి చేస్తున్న యువకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతో పాఠశాల బస్సు డ్రైవర్‌పై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన బుధవారం పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన అదే గ్రామ డ్రైవర్ పఠాన్ అంజాద్ రోజుమాదిరిగా తోటల చెరువుపల్లి నుంచి విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని తిరిగి పామూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కనిగిరికి చెందిన హసన్‌తో సహా మరో ముగ్గురు యువకులు బస్సును నిలిపి దాడికి దిగారు. పథకం ప్రకారం ఒక్కసారిగా బస్సుకు అడ్డుగా రెండు మోటారు బైకులను నిలిపి అడ్డుకున్నారు. అనంతరం డ్రైవర్‌ను కిందికి లాగి రహదారిపైనే విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. కాగా, అంజాద్ సోదరిని కనిగిరికి చెందిన హసన్‌కు ఇచ్చి వివాహం చేయగా అతను తరచూ భార్యను వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈనేపథ్యంలో ఇటీవల అంజాద్‌తో పాటు మరికొంతమంది వెళ్లి అతన్ని మందలించి వచ్చారు. దీంతో వ్యక్తిగత కక్షతో హసన్ తన అనుచరులైన సుభానీ, సోను, పవన్‌కుమార్‌లతో కలిసి అంజాద్‌పై దాడికి పాల్పడి గాయపరిచారు. అంజాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

42 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

● ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు




సీజ్ చేసిన రేషన్ బియ్యం వద్ద అధికారులు

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరాయపాలెంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని సూరాయపాలెంలో ఇంటింటికి రేషన్ బియ్యాన్ని ఇచ్చే వాహన ఆపరేటర్ (ఎండీయూ ఆపరేటర్) కోళ్లకాడి పెంచలప్రసాద్ ఇంట్లో ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నాయనే సమాచారంతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 42 ప్లాస్టిక్ సంచుల్లో 50 కేజీల చొప్పున ఉన్న 2100 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే.నరసింహారావు, విజిలెన్స్ తహసీల్దారు జీఎస్ కృష్ణప్రసాద్, ఏఈఈబీ వెంకటరెడ్డి, పొదలకూరు సివిల్ సప్లయిస్ డీటీ ఇండ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌పై మైనింగ్ అధికారుల దాడి

● రెండు టిప్పర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టిప్పర్లతో మైనింగ్ అధికారి

కలువాయి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలం తెలుగు రాయపురం సమీపంలోని పెన్నా నదిలో ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక రీచ్‌పై బుధ వారం భూగర్భ వనరుల శాఖ అధికారులు దాడి చేశారు. రీచ్‌లో ఉన్న రెండు టిప్పర్లు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించడంతో పాటు ఇసుక లోడ్‌చేసే యంత్రం తాళం కూడా స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ అధికారులు ఆర్ఐ స్వాతి, టీఏలు వాణిశ్రీ, వెంకటేశ్వర్లు తెలిపారు. భూగర్భ వనరుల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జాలాజీనాయక్ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లపై దాడులు నిర్వహించినట్లు వారు చెప్పారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లు తీసుకెళుతున్న మినీ లారీ బోల్తాపడ్డ సంఘటన మండలంలోని తెడ్డుపాడు బీసీ కాలనీ సమీపాన 565 జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన ఓ గ్యాస్ ఏజెన్సీ వాహనం తెడ్డుపాడు, వెంగన్నపాళెం గ్రామాల్లో సిలిండర్లు పంపిణీచేసి తిరిగి దుత్తలూరుకు వెళుతుండగా తెడ్డుపాడు బీసీ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి లారీ బోలా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ మల్లవరపు హజరత్‌రెడ్డికి గాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్రవాడ వైద్యశాలకు తరలించారు. వాహనం బోల్తాపడ్డ సమయంలో సిలిండర్లు చెల్లాచెదురుగా రోడ్డుపై పడడం, ఆ సమయంలో వాహన రాకపోకలకు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆంధ్రజ్యోతి
కావలి
కందుకూరు
గురువారం, 10 ఏప్రిల్ 2025
7
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 440

పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలి

కలిగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ మండలంలోని పాస్టర్లు బుధవారం కలిగిరమ్మ గుడి సర్కిల్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ మృతి వెనుక నిజానిజాలను వెలుగుతీసి వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ముస్లిం మైనార్టీ నాయకులు తమ మద్దతు ప్రకటించారు.



న్యూస్ బాక్స్

రేపు డివిజన్‌స్థాయి టాలెంట్ టెస్టు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బడేవారిపాలెం ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో నేకునాంపురం అంబేడ్కర్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వలేటి మాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి చదివి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు, సీఎంఆర్ షీట్‌పై పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని తెలిపారు. టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు మాలకొండయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కావలి నుంచి లింగసముద్రానికి మరో బస్సు

లింగసముద్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కావలి నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు లింగసముద్రం గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజరు రావూరి శ్రీనివాసులు చెప్పారు. బుధవారం సాయంత్రం నుంచే ఈ బస్సును లింగసముద్రంకు నడుపుతున్నట్టు చెప్పారు. ఇంతకు ముందు కావలి డిపో నుంచి సాయంత్రం 4.30 గంటలకు లింగసముద్రంకు బస్సు వెళ్లిపోయిన తరువాత రాత్రి 8.15 గంటల మధ్యలో లింగసముద్రంకు బస్సు లేదన్నారు. అయితే ప్రజల వినతిని దృష్టిలో ఉంచుకొని కావలి నుంచి కొండాపురం మండలంలోని కొత్తపేట వరకు ఉన్న బస్సు సర్వీసును లింగసముద్రంకు పొడిగించినట్టు ఆయన తెలిపారు. దీనివల్ల ఆ గ్రామ ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఈ బస్సు సౌకర్యాన్ని ప్రజల వినియోగించుకోవాలని, ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

ఆగిన రీసర్వే!



సింగపేటలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- హడావిడిగా అవగాహన కార్యక్రమాలు
- సిబ్బంది లేరంటూ బుకాయింపు
- నీరు గారుతున్న సింగపేట రైతుల ఆశలు
- పరిష్కారానికి నోచని భూ సమస్యలు

అల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్లుగా ఎప్పుడెప్పుడు రీసర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందా అని ఎదురు చూసిన సింగపేట, అల్లూరు, అల్లూరుపేట రెవెన్యూ పరిధిల్లోని రైతులకు ఆగిన రీసర్వేతో నిరాశ ఎదురైంది. అత్యధిక విస్తీర్ణం కలిగిన ఈ గ్రామాల్లో చివరి దశలో రీసర్వే చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మిగిలిన పంచాయతీల్లో రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఆ గ్రామాల్లో తలెత్తిన సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. రీసర్వే ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి సాదాబైనామా ప్రక్రియను అధికారులు నిర్వహించడం లేదు. దీనిపై ఎవరైనా రైతు అడిగితే రీసర్వే ప్రక్రియలో పూర్తి చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. కానీ వారికి నచ్చిన వ్యక్తులకు మాత్రం సాదాబైనామా ప్రక్రియను చేపట్టి కొంతమంది అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ భరించలేక రైతులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న క్రమంలో ఈనెల 4న సింగపేట పరిధిలో రీసర్వే ప్రక్రియను ప్రారంభించేందుకు హుటాహుటిన ప్రకటనలు, అవగాహన ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించారు. దీంతో సంబరపడిన రైతులకు అధికారులు దానిని వాయిదా వేసి నిరాశను మిగిల్చారు. ఈ క్రమంలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన చెందుతున్నారు.

● సిబ్బంది లేరంటూ బుకాయింపు

రీసర్వే ప్రక్రియకు ముందుగానే సిబ్బంది సమస్య ఉందని తెలిసినపుడు ప్రకటనలు ఎందుకంటూ స్థానిక రైతాంగం మండి పడుతోంది. గ్రామసభలు నిర్వహించి రైతులను మభ్యపెట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తమ భూములకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు రైతులు శతవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ అధికారులు రీసర్వే సమయంలో చేస్తామని చెప్పడంతో నాలుగేళ్లుగా ఎదురు చూపులతోనే సరిపోయింది. మళ్లీ వాయిదా వేయడంతో రైతులు కోపానికి అధికారులు బలువుతున్నారు.

● నీరుగారిన రైతుల ఆశలు

రీసర్వే ప్రక్రియలో ఎన్నో సమస్యలు ఎదురై రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అవి పరిష్కారం కావడం లేదు. ఇదిలాఉండగా తమ భూములకు శాశ్వత రికార్డు ఏర్పడుతుందని భావించిన సింగపేట, అల్లూరు, అలూరు పేట రెవెన్యూ పరిధిల్లోని రైతుల ఆశలు నీరుగారాయి. ఏకకాలంలో మొత్తం వేలాది ఎకరాలకు రీసర్వే పూర్తి చేయాలని అభిప్రాయపడుతున్న అధికారులు ఇది సరైన పద్ధతి కాదని కొద్ది విస్తీర్ణంతో మొదలుపెడితే సిబ్బంది సంపూర్ణ స్థాయిలో చేరుకునేసరికి కొంతమేరకైనా ప్రక్రియ పూర్తవుతోంది కదా అని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు రీసర్వే ప్రక్రియను అనుకున్న సమయానికి అనుకున్నట్టే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రూ.300 కూలీ లభించేలా పని చేయించాలి : ఏపీడీ



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ బాబూరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు రోజూ రూ.300 వేతనం లభించేలా పని చేయించాలని ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల లోపు ఉపాధి పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. చేసిన పనిని బట్టే వేతనం లభిస్తుందని తెలిపారు. పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని తెలిపారు. మరో వారం రోజుల్లో కూలీల ఖాతాల్లో పెండింగ్ వేతనాలు జమ కానున్నట్లు తెలిపారు.

మహిళల చైతన్యంతోనే కుటుంబ వికాసం

● కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళలు చైతన్యవంతులైనప్పుడే కుటుంబాలు ఆర్థికంగా వికసిస్తాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకుని కుట్టు మిషన్ ద్వారా ఇంట్లోనే ఉంటూ నెలకు రూ.15 వేల పైన సంపాదించుకోవచ్చన్నారు. కావలి వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి చెందిందని, కుట్టు ద్వారా నిత్యం ఉపాధి లభిస్తోందన్నారు. దుస్తులు కుట్టడం కూడా ఒక కళ అని, దానిని చిన్న చూపు చూడవద్దన్నారు. మూడు నెలలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, కోఆర్డినేటర్ పద్మ, ఎంఈవో గోవిందయ్య, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి జ్యోతి బాబూరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం, నాయకులు నాయుడు రాంప్రసాద్, నారాయణ, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అగ్నిప్రమాద బాధిత చిన్నారులు త్వరగా కోలుకోవాలి

● ఆలయాల్లో జనసేన నాయకుల ప్రత్యేక పూజలు, హోమాలు

ఉలవపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లోని పాఠశాలలో ఈనెల 8వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని మండల జనసేన పార్టీ నాయకులు బుధవారం స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని జనసైనికులు ఆందోళనకు గురయ్యామన్నారు. మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూలగిరి శ్రీనివాస్, వక్కలగడ్డ మణికంఠ(అయ్యప్ప), చిలకా ప్రసాద్, లష్కర్ నాగేశ్వరరావు, తూనిగుంట గుప్తా, దన్యాసి శివ తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రతాప్‌రెడ్డి అవినీతిని ఆధారాలతో బయటపెడతాం

● మహాజన సైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర

కావలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆయన అనుచరులు సోషల్ మీడియాలో చేస్తున్న అవాస్తవ ప్రచారాలను మానుకోకపోతే ఆయన అవినీతి భాగోతాలను ఆధారాలతో సహా బయటపెడుతామని మహాజన సైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర హెచ్చరించారు. పట్టణంలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియలో మాట్లాడటం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రామిరెడ్డి పాల్పడిన అవినీతి అక్రమాలన్నింటికి తమ వద్ద ఆధారాలతో సహ బయటపెట్టాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. పనిచేసే ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అసత్య పోస్టులు పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మహాజనసైన్యం నాయకులు కత్తి లక్ష్మణ్, చేవూరు జగత్‌జీవన్‌రామ్, చేవూరు మదన్‌కుమార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాజనసైన్యం అధ్యక్షుడు చేవూరు సురేంద్ర, తదితరులు

రాష్ట్ర షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ

గౌరవ అధ్యక్షుడిగా మానుగుంట

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షుడిగా విధులు నిర్వహించుటకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. దీనికి ఆయన అంగీకరించడంతో బుధవారం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సాయి తత్వ ప్రచారం, సేవా కార్యక్రమాలకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గౌరవ సలహాదారుడిగా విధులు నిర్వహించేందుకు మాజీ మంత్రి ముక్కు కాశీరెడ్డి అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి గోపాలుని హరిహరరావు, సహాయ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, అలహరి చంచలరావు, శ్రీరామ్‌మూర్తి, నరసింహారావు, ముచ్చర్ల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డికి అంగీకారపత్రం అందచేస్తున్న షిరిడీ సాయి కమిటీ సభ్యులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాలకొండ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని మాలకొండ, పోకూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం 7వ జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు వజ్రమ్మ, సుజాత, శ్రీనివాసులు, కార్యకర్తలు పార్వతి, సరస్వతి, ఆశీర్వాదం, సుజాత, సుభాన్‌బీ, సుశీల, శ్యామల పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం నిరసన



మహిళలతో కలిసి ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ సిలిండర్లతో బుధవారం వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డు వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి పేదలపై భారం మోపారన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలో వచ్చిన మోదీ సర్కార్ నిత్యావసరాల ధరలు నియంత్రించండంలో ఘోరంగా విఫలమైందన్నారు. మోదీ మాయ మాటలు, ఎన్నికల వాగ్దానాలు నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారని, హామీలు అమలు చేయకపోగా విపరీత పోకడలు అవలంబించడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేయాలని, పెంచిన గ్యాస్ నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, కృష్ణయ్య, రమణయ్య, బంగారయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణ సామాజిక బాధ్యత

● ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యల నివారణ సామాజిక బాధ్యతని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ శిశువుల మధ్య వివక్ష చూపకూడదన్నారు. బేటీ పడావో బేటీ బచావో అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అందరూ విధిగా పాటించాల్సిన బాధ్యతన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ లింగ నిర్ధార పరీక్షలు చేయడం చేయించడం చట్టరీత్యా నేరమని, భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టంగా ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు పద్మజ, సౌజన్య, సలహామండలి సభ్యులు మాలకొండారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉలవపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో అబ్దుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 12 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికను వెల్లడిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎరుకలయ్య కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఎరుకలయ్య కుటుంబ సభ్యులతో దామా శివబాబు

కొండాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయిపేట పంచాయతీ కొమ్ముపాలెంకు చెందిన కొంకుముడుసు ఎరుకలయ్య కుటుంబానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును బుధవారం టీడీపీ నాయకుడు దామా శివబాబు బాధిత కుటుంబానికి అందజేసి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ఉన్నాడని, అతనికి పార్టీ కల్పించే ప్రమాద బీమా రూ.5 లక్షలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

అంబేడ్కర్ జయంతి స్మృతుల్లో ముస్లింలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం పెద్దలు, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారతరత్న, రాజ్యాంగ రూపకర్త, అనగారిణ వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి స్మృతుల్లో భాగంగా ముస్లీం మైనారిటీ పెద్దలు, నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఏఎడీ అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, ధమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 4 ఏళ్లుగా అంబేడ్కర్ జయంతికి ముందు ఆయన స్మృతులు కార్యక్రమం జరుతోంది. దీనిలో భాగంగా ఈనెల 1 నుంచి 13వ తేది వరకు అంబేడ్కర్‌కు నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా బుధవారం 9వ రోజు స్థానిక ముస్లింలు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఎస్‌కే రహీం, ఖాజా, ఉస్మాన్, యస్దాని, మొగల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం



బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు తీస్తున్న అధికారులు

కలిగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని భట్టువారిపాలెం గ్రామంలో రూ.1.45 కోట్లతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం అధికారులు కొలతలు తీశారు. ఈ సందర్భంగా సర్పంచు సూరేపల్లి మాధవ మాట్లాడుతూ భట్టువారిపాలెం గ్రామ సమీపంలో వర్షాకాలంలో వాగు నుంచి వచ్చిన నీరు ఉధృతంగా ప్రవహించడం వలన నాలుగైదురోజులపాటు స్థానికులు గ్రామం నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన వెంటన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ మేరకు ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ విశ్వేశ్వరరావు, ఏఈ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కొలతలు తీసి పనులకు శ్రీకారం చుట్టారు.

కమనీయం సీతారాముల కల్యాణం

● వైభవంగా పుష్పయాగం

కావలిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లోని పట్టాభిరామస్వామి ఆలయంలో ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. రాత్రి శ్రీరాముల పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా టీడీపీ నాయకులు సన్నిబోయిన నారాయణ వ్యవహరించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు షరాబు సుబ్రమణ్యం, కోశాదికారి అమరా వేదగిరి, కమల్, కర్నాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఉత్తరంపేట పట్టాభిరామస్వామి ఆలయం, జనతాపేట సీతారామస్వామి రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, విశేష పూజలు జరిగాయి. రాత్రి సీతారాములకు పుష్పయాగం కనుల పండువగా జరిగింది.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చేతిపంపు వద్ద నీటి కోసం అవస్థ

లింగసముద్రం మండలం మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మంచినీటి చేతిపంపు తక్కువ ఎత్తులో ఉంది. దీంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది క్రితం చేతిపంపు వద్ద ప్లాట్‌ఫ్లాం నిర్మించారు. దీంతో బోరింగ్ కింద నీరు వచ్చే పైపు పల్లంలోకి వెళ్లింది. దీంతో పైపు కింద బిందె పట్టి నీరు పటుకోవాలంటే వంట నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విద్యార్థులు మంచినీటికి అవస్థలు పడుతున్నారు. తక్షణం దీనిని ఎత్తు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు టీడీపీ నాయకుడు అంగుళూరి చినకొండయ్య, కాలనీవాసులు కోరుతున్నారు.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)



పాఠశాలలో తక్కువ ఎత్తులో ఉన్న చేతిపంపు



విశేష అలంకరణలో సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి

శబరి రామయ్య బ్రహ్మోత్సవాలు



మాతృకా పూజ చేస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. అర్చక బృందం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. నందికేశ్వరా కూచిపూడి కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరిం చాయి. బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం 8గంటలకు ధ్వజారోహణ, హోమం, ఉదయం 10 గంటలకు అర్చన, హారతి, సాయంత్రం హోమం, బలిహరణం, రాత్రి శేష పాన్పు అలంకరణలో నగరో త్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతా యని ఆలయం చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేపు జ్యోతిరావు పూలే జయంతి

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకట లక్ష్మ్మ తెలిపారు. ఆ వేడుకలకు సంబం ధించి బుధవారం నగరంలోని ఆమె చాంబర్‌లో సన్నాహక సమావేశం జరిగింది. బీసీ కుల సంఘాల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పూలే 199వ జయంతి వేడుకలను ఉదయం 10.30 గంటలకు ఘనంగా జరపడానికి నాయకులు అంగీకరించారు.

పెండింగ్ బిల్లుల వివరాలివ్వండి: కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్వామా, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి పెండింగ్ బిల్లుల వివరాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి ఆయన అధికారులతో సమావేశ మయ్యారు. 2017-18, 2018-19 సంవత్సరాల్లో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కాంక్రీటు పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, బిల్లుల అప్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు మొదలైన అంశాలపై చర్చించారు. ఆయా పనులు, బిల్లుల పూర్తి వివరాలు అందించాలని సూచించారు. జిల్లాలో రూ.38కోట్లు నీటి తీరువా పన్నులు బకాయి ఉన్నాయని, సాగునీటి కాలువల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు రైతులకు అవగాహన కల్పించి పన్నులు చెల్లించేలా సహకరించాలని కోరారు. ఆ నగదును జిల్లాలోని సాగునీటి కాలువల అభివృద్ధి, నిర్వహణ పనులకు వినియోగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డ్వామా పీడీ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచండి

● డీఏవో సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీరు సమృద్ధిగా ఉందని, ఎడగారు సీజన్‌లో పంటల సాగు కోసం రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వనరుల కేంద్రంలో బుధవారం విత్తన తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్స్, ఎరువుల కంపెనీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. కేఎన్ఎం రకాలతో పాటు నెల్లూరు జిలకర, ధాన్యరాశి, శ్వేత, సుగంధ, జింక్ వరి రకాలు రైతులు సాగు చేసే అవకాశం ఉందని చెప్పారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులను సైతం నిల్వ ఉంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న డిప్లమో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం కళాశాల అభివృద్ధి పనులపై ఆరాతీసి చేపట్టవలసిన కార్యక్రమాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ పరికరాలతో రైతులకు తోడ్పాటు

● డీఏవో సత్యవాణి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ పనిముట్లను రాయితీ ధరలకు అందించడంతో ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి అన్నారు. బుధవారం మండలంలోని ఆమంచర్లలో రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు ఈ రాయితీ పరికరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసులు, శేషగిరిరావు, ఏవో నాగమోహన్, టీడీపీ నాయకులు వేణు నాయుడు, శివకుమార్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగదు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ ఓ యువతిని నమ్మించి రూ.2.58 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరు నగరానికి చెందిన సాయిజ్యోత్స్న ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్‌కు గత నెల 20వ తేదీన సేవింగ్స్, ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరిట లింక్ వచ్చింది. దానిని ఆమె క్లిక్ చేయగానే ఆమె వాట్సప్ నెంబరుకు నితేష్ అనే వ్యక్తి మెసేజ్ చేశారు. తాను డాటాబాక్స్ బిజినెస్ డాట్‌కమ్ కంపెనీకి చెందిన ప్రతినిధినని, ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సూచనలు సలహాలు ఇస్తూ అధిక లాభాలు వచ్చేలా చేస్తానని అందులో పేర్కొన్నారు. అనంతరం నితేష్ టెలిగ్రామ్ యాప్‌లో ఆమెను యాడ్‌చేసి మెసేజ్ చేశారు. కంపెనీలో అకౌంట్ ఓపెన్ చేశారు. ఆ సమయంలో యువతి బ్యాంకు వివరాలు సేకరించారు. అనంతరం ఆమెను నమ్మించేందుకు కంపెనీ పాడెక్ట్ ఫీడ్‌బ్యాక్ చేయించి రూ.14,375 నగదు ఆమె బ్యాంకు ఖాతాలో జమచేశారు. దీంతో ఆమెకు నితేష్‌పై నమ్మకం పెరిగింది. ఇదే అదునుగా భావించిన నిందితుడు కంపెనీలలో పెద్ద మొత్తంలో డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో జ్యోత్స్న మూడు దఫాలుగా రూ.2,58,096 నగదు డిపాజిట్ చేశారు, అనంతరం ఆమె తన అకౌంట్‌ను పరిశీలించగా పెద్దమొత్తంలో నగదు ఉన్నట్లు చూపించింది. ఆ నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించగా పెండింగ్‌లో ఉన్నట్లు చూపించింది. దీంతో ఆమె కంపెనీ కస్టమర్ సపోర్ట్ ప్రతినిధులతో చాట్ చేయగా కమిషన్ కింద రూ.4 లక్షలు డిపాజిట్ చేస్తే అకౌంట్‌లోని మొత్తం నగదు డ్రా చేసుకోవచ్చన్ని సూచించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు ఈ నెల 1వ తేదీ ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియా నియంత్రణకు ప్రత్యేక కృషి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



ఫైలేరియా బాధితులకు కిట్లు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫైలేరియా వ్యాధి నియంత్రణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. బుధవారం నెల్లూరు లోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా (బోధ) వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యూలెక్స్ దోమ వల్ల ఫైలేరియా వస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. శరీరంలో వ్యాధిసోకిన ప్రాంతా లను ఈ కిట్లతో శుభ్రం చేసుకోవాలని సూచిం చారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ హుస్సేనమ్మ మాట్లాడుతూ తగిన చికిత్స తీసుకుంటే ఫైలేరియాను నియంత్రించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జునైద్ సిద్దిక్, మలేరియా విభాగం సహాయ అధికారి నాగార్జున రావు, కో ఆర్డినేటర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితులకు న్యాయం

● ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే దళితులకు న్యాయం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరుకు వచ్చిన ఆయన జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని చెప్పారు. ఈ ఏడాదికి రూ.51.81 కోట్లతో 1240 మందికి లబ్ధి చేకూరే విధంగా పలు యూనిట్లు మంజూరు చేసిందన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఈ నెల 14 నుంచి మే 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే 11 నుంచి 20 వరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, 21 నుంచి 27 వరకు ఎంపికైన వారి జాబితాను బ్యాంకులకు ఎంపీడీవోలు పంపుతారని చెప్పారు. జూన్ 13 నుంచి 20 వరకు పాలనా ఉత్తర్వులు అందజేసి, జూన్ 21 నుంచి ఆగస్టు 9 లోగా యూనిట్లు గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, పీ చంద్రశేఖర్, మార్కెట్ సురేష్, జమీర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాల మహానాడు నగర అధ్యక్షుడు కమతం అశోక్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ భవనం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విజయ్ కుమార్ ప్రారంభించారు. మూడు నెలలు చలివేంద్రాన్ని కొనసాగి స్తామని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, నాయకులు కొత్తకోట కిరణ్, గణేష్, వడ్లమూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

◆ ◆ ◆



విరాళంగా అందిన కంప్యూటర్లను చూపుతున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

రూ.9.15 లక్షల విలువైన కంప్యూటర్ల వితరణ

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విర్కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.9,15,000 విలువైన 15 హెచ్‌పీ డెస్క్‌టాప్ కంప్యూటర్లు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన విషయాల్లో ప్రగతిని సాధించడానికి విర్కో ఫౌండేషన్ చైర్మన్ నారాయణరెడ్డి విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ చైర్మన్ మిత్రులు కొండేపి శ్రీరామచంద్రరావు, విశ్రాంత హెచ్ఎం ఇప్పగుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ప్రీ స్కూల్, హైస్కూల్ భవనాలను నిర్మించడం, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, 10వ తరగతి, కాలేజీ విద్యాభ్యాసంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఏడాదికి రూ.15,000 అందిస్తున్నారన్నారు. కేన్సర్ బారిన పడిన 287 మంది పేదింటి పిల్లలకు కీమోథెరపీ అందించారన్నారు. 1566 మంది కిడ్నీ సంబంధిత రోగులకు డయాలసిస్ చేయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు డెస్క్‌టాప్ కంప్యూటర్లు అందచేసినట్లు పేర్కొన్నారు. కళాశాలకు భారీ వితరణ అందించిన విర్కో ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడిబయట పిల్లలు బడిలోనే ఉండాలి

● డీఈవో బాలాజీరావు



డ్రాపవుట్స్‌ను బడిలో చేర్పిస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బడిబయట పిల్లలందరూ ఇకపై బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు ఆదేశించారు. నెల్లూరులోని మహాత్మాగాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో డ్రాపవుట్ విద్యార్థులను బుధవారం ఆయన స్వయంగా కలిసి బడిలో చేర్పించి మాట్లాడారు. బడిఈడు పిల్లలు బడిలో చదువుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు బడిబయట పిల్లల వివరాలు సేకరించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు జారీ చేశామని తెలిపారు. అనంతరం షేక్ ఆస్మా, షేక్ అబిదా కౌసర్‌ను ఆయన పాఠశాలలో చేర్పించి రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయించారు. ఈ కార్యక్ర మంలో రూరల్ ఎంఈవో మురళీధర్, ప్రధానోపా ధ్యాయుడు షేక్ ఖాజా రహంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెం లేఅవుట్‌లో నిగ్గుతేలిన అవినీతి

● సబ్ రిజిస్ట్రార్ల చేతివాటాన్ని గుర్తించిన ప్రభుత్వం

● నలుగురిపై చర్యలకు ఆదేశం

కోవూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన నార్తురాజు పాళెం గ్రామ పొలిమేరలో ఏర్పాటుచేసిన మారుతీ లేఅవుట్ రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు తగినంత చెల్లించలేదు. దీంతో నలుగురు సబ్‌రిజిస్ట్రార్లపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తాజాగా రిజిస్ట్రేషన్‌శాఖను ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. కొడవలూరు మండలం నార్తురాజు పాళెం గ్రామ పరిధిలోని ఆరో వార్డులో ఏర్పాటు చేసిన మారుతీ లేఅవుట్‌కు సమీపంలోని డోర్ నెంబరు 6-102లో చదరపు అడుగు ధర రూ.600. ఆ డోర్‌నంబరు పక్కనే ఉన్న ప్లాట్లను నలుగురు సబ్‌రిజిస్ట్రార్లు చదరపు అడుగు ధర రూ.250, రూ.125లకే నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేశారు. 2004లో కోవూరులో సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసిన లలితమ్మ చదరపు గజం ధర రూ.125గా నిర్ణయించి 170 డాక్యుమెంట్లను చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.14,91,000 గండిపడింది. సయ్యద్ సిత్రాజ్ చదరపు గజం ధర రూ.125గా నిర్ణయించి ఏడు డాక్యుమెంట్లను రిజిస్టర్ చేశారు. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.64,400 గండి పడింది. 2004 మార్చి 24న ఇన్‌చార్జి సబ్‌రిజిసస్ట్రార్‌గా పనిచేసిన టీఎల్ కాంతారావు చదరపు గజం రూ.250గా నిర్ణయించి మూడు డాక్యుమెంట్లను చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.5,77,926ల గండిపడింది. 2004లో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సయ్యద్ మహబూబ్‌బాష చదరపు గజం రూ.250గా నిర్ణయించి ఏడు డాక్యుమెంట్లను చేయడంతో రూ.14,73,993 ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. ప్రభుత్వానికి చెందాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించకుండా అవకతవకలకు పాల్పడిన నలుగురు సబ్‌రిస్ట్రార్లపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● 20 ఏళ్ల తరువాత ఆదేశం

రిజిస్ట్రేషన్ ఫీజు విషయమై ఆ శాఖకు చెందిన ఉద్యోగులే ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నెల్లూరుకి చెందిన అడ్వకేట్ పెంచలరెడ్డి ఫిర్యాదు చేసేందుకు ఆ నలుగురిలో ఒకరే కారణమని చెబుతున్నారు. మనస్తాపానికి గురైన ఓ సబ్‌రిజిస్ట్రార్ ఫీజు మతలబు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. రిజిస్ట్రేషన్‌శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా, ఫలితం లేకపోవడంతో నేరుగా ఆయన ప్రభుత్వానికే విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం రెండు దశాబ్దాల తరువాత చర్యలకు ఆదేశించింది. నలుగురు రిజిస్ట్రార్లలో ఇప్పటికే ఇద్దరు పదవీ విరమణ చేశారు. మరో ఇద్దరు పదవీ విరమణకు సమీపంలో ఉన్నారు. క్రమశిక్షణ చర్యలు ఎలా ఉంటాయనే విషయమై ఎలాంటి సమచారం లేదని రిజిస్ట్రేషన్ శాఖాధి కారులు తెలిపారు. వారి జీతాల నుంచి లేదా పింఛన్ల నుంచి నగదు రికవరీ చేస్తారని పలువురు భావిస్తున్నారు.



కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కేంద్ర ప్రభుత్వ బిల్లుతో పెన్షనర్లకు ఇబ్బందులు: మాజీ ఎమ్మెల్సీ విఠపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆర్థిక బిల్లు పెన్షన్-2025 వల్ల పెన్షనర్స్ పరిస్థితి దారుణంగా మారే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ మాట్లాడుతూ 2023-24, 2024-25 సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదాయ పన్ను వివరాలను సభ్యులందరికీ వివరించారు. పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్ శ్రీహరి, ఎస్‌కే ఖాజా రసూల్, వెంకట స్వామి, ఎస్‌కే ఖాసిం, కోశాధికారి మూర్తి, హజరత్తయ్య పాల్గొన్నారు.

మెప్మా సంఘాల జీవనోపాధుల మెరుగుకు కృషి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

'ఈ-శ్రమ్'లో మెప్మా పీడీ రాధమ్మ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి చేస్తున్నామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ చెప్పారు. నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఈ-శ్రమ్ కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ మెప్మా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. సీఎస్సీ సెంటర్ డీపీఎం సురేష్ మాట్లాడుతూ సీఎస్‌సీ సెంటర్ నిర్వహణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మెప్మాలో నిర్వహిస్తున్న అన్నీ కార్యక్రమాలు, పొదుపు సంఘాల లావాదేవీలు, ఆడిట్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఎంలు కవిత, జరీనా, టీఈ కాంతయ్య, అంకయ్య, సీవోలు, ఆర్‌పీలు, టీఎల్ఎఫ్ అధ్యక్షులు లక్ష్మీ, మాధవి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో లెక్చరర్ల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో 2025-26 సంవత్సరానికి డిప్యుటేషన్‌పై లెక్చరర్లుగా పనిచేయుటకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైట్‌లో 27 (22 సాధారణ అధ్యాపకులు, 5 ఉర్దూ) లెక్చరర్ల పోస్టులకు ఉమ్మడి నెల్లూరుజిల్లాలో పనిచేస్తున్నవారు అర్హులని తెలిపారు. అయితే వారికి 58 ఏళ్ల వయసు మించరాదని, ఐదేళ్ల అనుభవం, సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు వచ్చి ఉండాలని తెలిపారు. ఎంఈవోలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు ఈనెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 16, 17వతేదీల్లో అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని, 19న జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

శ్మశాన స్థలం కోసం ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న మహిళలు

కోవూరు, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలం కోసం బుధవారం స్థానిక నందలగుంట సమీపంలోని గిరిజనులు ఆందోళన చేపట్టారు. నందలగుంట నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనున్న స్థలాన్ని చాలాకాలం నుంచి తాము శ్మశానంగా వాడుతున్నామని, ఇటీవల మృతదేహాలను పూడ్చనీయడం లేదని గిరిజనులు వాపోయారు. ఈ క్రమంలో బుధవారం అద్దూరు పెంచలయ్య అనారోగ్యంతో మృతిచెందగా, వివాదాస్పద స్థలంలో పూడ్చేందుకు కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు కేసీ పెంచలయ్య నాయకత్వంలో పెద్దసంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతపరచారు. తహసీల్దారు నిర్మలానంద బాబ మాట్లాడుతూ ఈ వివాదాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చేంత వరకు వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు. దీంతో వారు శాంతించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నామని గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకట రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రూ.2.14కోట్లతో అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో 17.93లక్షల మందికి వివిధ పథకాల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో భూగర్భజల మట్టం గరిష్ఠంగా 18మీటర్లుగా ఉందని తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం, గుడ్లూరు మండలాలు, కోవూరు నియోజకవర్గంలో కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలు, ఉదయగిరిలో సీతారామపురం మండలం, సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు మండలం, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూరల్ మండలంలో భూగర్భ జలాల కొరత ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. బస్టాండ్‌లు, పంచాయతీలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో తాగునీరు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పశువులకు నీటి ఇబ్బంది ఏర్పడకుండా నరేగా నిధులతో 109 నీటి తొట్టెలను నిర్మించామని వివరించారు. మరో 764 తొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

ఫిజియోథెరపీపై శిక్షణ

కొడవలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించడానికి ఆరోగ్య సమస్య రాకుండా ఉండేందుకు, ఇతర ప్రయోజనాల కోసం ఫిజియోథెరఫి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సంతోష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8617
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ.96.20

భక్తుల ప్రాణాలతో చెలగాటమా...?

● ఉత్సవాల్లో ఫిట్‌నెస్ లేని వినోద పరికరాల ఏర్పాటు ● కనుపూరులో అభ్యంతరం, బుచ్చిలో అనుమతి ● ప్రజల రక్షణ మరచిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటైన రంగులరాట్నం, జెయింట్‌వీల్ తదితర వినోద పరికరాల ఫిట్‌నెస్‌పై స్థానికులు, భక్తులు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నా, సంబంధిత అధికారుల్లో చలనం లేదు. బ్రహ్మోత్సవాలకు వేలాదిగా వచ్చే భక్తుల వినోదం కోసం జెయింట్‌వీల్, రంగులరాట్నం, బ్రేక్‌డాన్స్‌లు, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగానే ఏర్పాటైన ఈ యంత్రాలకు ఫిట్‌నెస్ లేవనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కారణంతో కనుపూరుజాతరలో వీటిని ఆపేశారు. అయితే బుచ్చిలో మాత్రం అధికారులెవరూ పట్టించుకోకుండా అనుమతులు ఇచ్చేశారు. జెయింట్ వీల్, రంగులరాట్నం ఏర్పాటు చేయాలంటే నిర్వాహకులు వాటికుండే మోటారు స్థాయిని బట్టి సుమారు రూ.2లక్షల వరకు డీడీలు తీసి విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి పొందాల్సి ఉంది. ఇక్కడ అలాంటి అనుమతులేమి తీసుకోలేదు. జిల్లాలో ఎక్కడ తిరునాళ్ల జరిగినా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు ఎదురవకుండా అధికారులతో ప్రత్యేక (కోఆర్డినేషన్)సమావేశం ఏర్పాటు చేసి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.బుచ్చిలో ఈ విషయాన్ని అధికారులు మరిచిపోయినట్లు ఉన్నారు. వినోద పరికరాల ఫిట్‌లెస్‌పై ఇప్పటికైనా ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని బీజేపీ, నాయకులు కే. శ్రీనివాసులు, ఎంపీటీసీ వినయ్ నారాయణ కోరారు.



బుచ్చి కోదండరాముడి బ్రహోత్సవాల్లో ఫిట్ నెస్ లేకుండా ఏర్పాటైన రంగులరాట్నం



ఫిట్‌నెస్ లేని జెయింట్‌వీల్

కోదండరాముడికి హనుమంతసేవ

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దూరులో కొలువై ఉన్న సీతా,లక్ష్మణ సమేత శ్రీ కోదండ రాముడి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కోదండరాముడు హనుమంతు వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారు తిరుచ్చి వాహనంపై ఊరేగారు. వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా గురువారం ఉదయం స్వామివారికి ఉదయం మోహిని అవతారం, రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు.



హనుమంత వాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల ప్రారంభం



శూలప్పను మోసుకెళుతున్న భక్తులు

మనుబోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామంలో బుధవారం రాత్రి నుంచి శ్రీకామాక్షితాయి సమేత సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు శివాలయంలో త్రిశూలేశ్వరుడికి (శూలప్ప)ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో సంగమేశ్వరాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం త్రిశూలేశ్వరుడికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్‌దీపాలంకరణ,బాణసంచా, తప్పెట్ల సందడి మధ్య శూలప్ప పయనం వైభవంగా సాగింది.

ఆర్థిక సాయం అందజేత



రేవతికి ఆర్థిక సాయం అందిస్తున్న పీడీ సుమతి

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా వెన్నెముక సమస్యతో మంచానికే పరిమితమైన స్థానిక నరసారెడ్డికాలనీకి చెందిన కూచిపాటి వరప్రసాద్‌కు బుధవారం చేజర్ల హైస్కూల్ పీడీ సుమతి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆమె వరప్రసాద్ భార్య రేవతికి అందించి ఆర్థిక భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటుపై వివాదం

● రౌడీమూకలతో దాడికి యత్నం

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగామాంబాపురం మిక్స్‌డ్‌కాలనీలో మల్లికార్జున అనే వ్యక్తి ఇంటి వద్ద విద్యుత్ స్తంభం ఏర్పాటును వార్డు మెంబరు అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం మంగళవారం జరిగింది. గ్రామ పెద్దలు మందలించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే అదేరోజు రాత్రి బుచ్చి నుంచి కొంతమంది రౌడీమూకలు వచ్చి మల్లికార్జున ఇంటిపై దాడికి యత్నించారు. చుట్టుపక్కల వారు అప్రమత్తం కావడంతో అక్కడినుంచి పరారయ్యారు. ఈ విషయంపై మల్లికార్జున బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.



దాడి చేసేందుకు బైక్‌లపై వచ్చిన రౌడీమూకలు

కోనలో వైభవంగా వసంతోత్సవాలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో వసంతోత్సవాలను బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం నుంచి 12వ తేదీ వరకు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నందున స్వామివారికి జరిగే నిత్య కల్యాణం రద్దుచేసి తిరిగి 13 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పీ. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాపూరు మండలంలో బెల్టుషాపుల జోరు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్ట్‌షాపులు జోరుగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలో అనధికారికంగా బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మండలంలో చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 100కు పైగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్ముతున్నారని మందుబాబులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పొదలకూరులో రెండిళ్లలో చోరీ

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండిళ్లలో గుర్తు తెలియని దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. పొదలకూరులోని శ్రీనివాస లేఅవుట్‌లో నివాసం ఉంటున్న ప్రభాకర్, కాకుమాను లేఅవుట్‌లో నివాసం ఉంటున్న అల్లాభక్షు ఇళ్లలో ఈ చోరీలు జరిగాయి. ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. శ్రీని వాస లేఅవుట్‌లో చెందిన ప్రభాకర్ కుటుంబం ఉగాదిని పురస్కరించుకుని సోమవారం స్వగ్రామమైన చేజర్ల మండలం చీర్లవారికండ్రిగ గ్రామానికి వెళ్లింది. తిరిగి బుధవారం ఇంటికి వచ్చి చూసుకోగా చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో చూడగా 15 సవర్ల బంగారం, ఒకటిన్నర కిలోల వెండి, రూ.లక్ష నగదు అపహరణకు గురైందని బాధితుడు ప్రభాకర్ వెల్లడించారు. అలాగే కాకుమాను లేఅవుట్‌లో నివాసం ఉంటున్న అల్లాభక్షు కుటుంబం శుభకార్యం కోసం బుధవా రం మధ్యాహ్నం కలువాయికి వెళ్లారు. ఈ నేపథ్యంలో రెండిళ్లల్లోనూ ఎవరూ లేరని గ్రహించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ప్రభాకర్ ఇంట్లో తలుపు పగులగొట్టి, అలాగే అల్లాభక్షు ఇంట్లో గ్రిల్స్ కట్ చేసి లోపలికి చొరబడి 10 సవర్ల బంగారు నగలు దోపిడీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రెండు చోరీలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చిందరవందరగా పడిఉన్న బీరువాలోని వస్తువులు

పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోండి

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తొలగించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలని వెంకటా చలం సీడీపీవో వీ.విజయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని నరసారెడ్డి కాలనీలోని అం గన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించా రు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే రక్తహీనతను పోగొట్టేందుకు పోషకాలతో కూడిన పదార్థాలను సక్రమంగా అందించాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో చేసిన సలాడ్‌ను ఎక్కువగా వినియోగించాలన్నారు. చిన్నారులకు ముర్రుపాలు ఇవ్వాలని, ముర్రుపాలు పిల్లల రక్షణకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, వెంకటరత్నమ్మ, వెంకటకుమారి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

రైతుల సంక్షేమానికి కోవూరు ఎమ్మెల్యే కృషి

విడవలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంతో కృషి చేశారని రైతు సంఘం నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి, పోలిరెడ్డి ఆశోక్‌రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. విడవలూరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పాలనలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తోలితే సకాలంలో నగదు రాక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రైతుల ఇబ్బందులను తెలుసుకుని, అధికారులు, మంత్రులతో సంప్రదించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తోలండని రైతులకు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. మిల్లర్లతో మాట్లాడి సకాలంలో లారీలను తీసుకుని వచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చూశారన్నారు. కార్యక్రమంలో పీ. మల్లికార్జునరెడ్డి, ఎం. చంద్రమోహన్, ఎం.చరణ్, సూరగాని గోపి, పందేల్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లేటి కాలువ పరిశీలన

● అక్రమణలు తొలగిస్తామని అధికారుల హామీ



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ పెంచలయ్య

విడవలూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివర్తి రెవెన్యూ పరిధిలోని ఎల్లేటి కాలువ ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ డీఈ పెంచలయ్య తెలిపారు. 'ఆక్రమణల తొలగింపులో మీనమేషాలు' అనే శీర్షికన ఈ నెల2న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లాధికారులు స్పందించారు. విచారణకు ఆదేశాలు జారీ చేశారు దీంతో ఇరిగేషన్ డీఈ పెంచలయ్య, ఏఈ శ్రీనివాసులు బుధవారం ఎల్లేటి కాలువ ఆక్రమణలను పరిశీలించారు. రైతు దేవళ్ల శివకోటారెడ్డి, మరికొంతమందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఎల్లేటి కాలువను రెవెన్యూ అధికారులు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారని వాటిని ఆక్రమణదారులు తీసివేయడం మూలంగా మళ్లీ సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు తెలియపరుస్తామన్నారు. సర్వే పూర్తవగానే ఆక్రమణలు తొలగిస్తామన్నారు. దీంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై అవగాహన

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా రూపొందించారని పేర్కొన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తు కోసం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ జీ.విజయలక్ష్మి, విజయనందకుమార్‌బాబు, డాక్టర్ ఆర్.ప్రభాకర్, డాక్టర్ ఎస్‌బీ.భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వలస కార్మికులకు రేషన్ ఇవ్వాలి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో నివాసముంటున్న వలస కార్మికులకు రేషన్ సరుకులు ఇవ్వాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతిలో మాట్లాడుతూ గత ఏడాది మేనెల వరకు రేషన్ సరుకులు ఇచ్చేవారని, జూన్ నుంచి ఇవ్వడం లేదని తెలిపారు. బయోమెట్రిక్ ద్వారా ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉంటే, వలస కార్మికులకు సరుకులు ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా తహసీల్దారు కృష్ణప్రసాద్ జోక్యం చేసుకుని, వలస కార్మికులకు రేషన్ సరుకులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చల్లివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో కల్పన

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిపర్తిలో ప్రయాణికులు, వాహన చోదకులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు బుధవారం ఎంపీడీవో కల్పన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవి ముగిసే వరకు ఈ చల్లివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... పొదలకూరుకి చెందిన శ్రీనివాసులు మోటర్ బైక్‌పై ముత్తుకూరులోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. పుంజులూరుపాడు రైల్వే గేటు దాటాక పోర్టు రోడ్డుపై లారీ ఆగి ఉండగా రాంగ్ రూటులో వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఇస్కపాళెం పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచికి పుత్రవియోగం

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దూరుకి చెందిన బుచ్చి మాజీ సర్పంచు దొడ్ల అన్నారెడ్డి కుమారుడు దొడ్ల రామనరసారెడ్డి(76) బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మాజీ ఎంపీపీ భర్త దొడ్ల కోదండ రామిరెడ్డి తెలిపారు. నెల్లూరులోనే అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నిర్వహణాధికాఆరి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 8464 మంది విద్యార్థులకుగాను 7940 మంది హాజరుకాగా, 524 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, జేసెస్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

విజయ్‌కుమార్‌తో జనసేన నేత భేటీ

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకి విచ్చేసిన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్‌ను బుధవారం జనసేన మండల ప్రధాన కార్యదర్శి కాకి శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి మాట్లాడారు. జనసేన కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన దళిత కార్యకర్తలు, ఎస్సీల్లో వెనుకబడిన పేదలను మాల కార్పొరేషన్ ద్వారా ఆదుకోవాలని ఆయన కోరారు.

16 నుంచి స్పోర్ట్స్, టెక్ ఫెస్ట్

కొడవలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవలూరులో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16న స్పోర్ట్స్ ఫెస్ట్, 17,18 తేదీల్లో టెక్ ఫెస్ట్ సెలబ్రేషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ గుణశేఖర్, గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పీ.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయా విభాగాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల కార్యక్రమంలో మొదటి రోజు విద్యార్థులకు, అధ్యాపకులకు క్రీడా పోటీలు, రెండోరోజు టెక్నికల్ ఫెస్ట్, పలు రకాల పోటీలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీతారల సందడి ఉంటున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీ .ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

పెన్నాలో దూకి వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పెన్నా బ్యారేజీ వద్ద బుధవారం ఒక వివాహిత నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రంగనాయకులపేట ముస్లింవీధికి చెందిన సల్మా(38)కు నాల్గోమైలుకు చెందిన అఫ్జల్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు. ఆమె కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. బుధవారం రంగనాయకులపేటలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. వారు లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయి పెన్నాబ్యారేజ్ వద్ద నదిలో దూకింది. స్థానికులు గమనించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో సల్మా కోసం గాలించారు. కొద్ది సేపటికి సల్మా మృతదేహం బయట పడింది. సమాచారం అందుకున్న సల్మా తల్లిదండ్రులు, భర్త అక్కడకు చేరుకున్నారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని విజయమహల్ గేటు సమీపంలో బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహం కుడి చేతిపై అమ్మ, ఓం అనే పచ్చబొట్లు ఉన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక..

వెంకటాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతీ నగర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న జింకను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... తాగునీటి కోసం సరస్వతీ నగర్ గ్రామంలోకి వచ్చేందుకు జింక రహదారి దాటుతుండగా వాహనం ఢీకొంది. ఈ విషయాన్ని స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వచ్చి జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై దాడి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతో పాఠశాల బస్సు డ్రైవర్‌పై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన బుధవారం పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన అదే గ్రామ డ్రైవర్ పఠాన్ అంజాద్ రోజుమాదిరిగా తోటల చెరువుపల్లి నుంచి విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని తిరిగి పామూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కనిగిరికి చెందిన హసన్‌తో సహ మరో ముగ్గురు యువకులు బస్సును నిలిపి దాడికి దిగారు. పథకం ప్రకారం ఒక్కసారిగా బస్సుకు అడ్డుగా రెండు మోటారు బైకులను నిలిపి అడ్డుకున్నారు. అనంతరం డ్రైవర్‌ను కిందికి లాగి రహదారిపైనే విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. కాగా, అంజాద్ సోదరిని కనిగిరికి చెందిన హసన్‌కు ఇచ్చి వివాహం చేయగా అతను తరచూ భార్యను వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈనేపథ్యంలో ఇటీవల అంజాద్‌తో పాటు మరికొంతమంది వెళ్లి అతన్ని మందలించి వచ్చారు. దీంతో వ్యక్తిగత కక్షతో హసన్ తన అనుచరులైన సుభానీ, సోను, పవన్‌కుమార్‌లతో కలిసి అంజాద్‌పై దాడికి పాల్పడి గాయపరిచారు. అంజాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డ్రైవర్‌పై దాడి చేస్తున్న యువకులు

42 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

● ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు

పొదలకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరాయపాలెంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని సూరాయపాలెంలో ఇంటింటికి రేషన్ బియ్యాన్ని ఇచ్చే వాహన ఆపరేటర్ (ఎండీయూ ఆపరేటర్) కొళ్లకాడి పెంచలప్రసాద్ ఇంట్లో ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నాయనే సమాచారంతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 42 ప్లాస్టిక్ సంచుల్లో 50 కేజీల చొప్పున ఉన్న 2100 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే.నరసింహారావు, విజిలెన్స్ తహసీల్దారు జీఎస్ కృష్ణప్రసాద్, ఏఈఈబీ వెంకటరెడ్డి, పొదలకూరు సివిల్ సప్లయిస్ డీటీ ఇండ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.




సీజ్ చేసిన రేషన్ బియ్యం వద్ద అధికారులు

ఇసుక రీచ్‌పై మైనింగ్ అధికారుల దాడి

● రెండు టిప్పర్ల స్వాధీనం

కలువాయి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలం తెలుగు రాయపురం సమీపంలోని పెన్నా నదిలో ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక రీచ్‌పై బుధ వారం భూగర్భ వనరుల శాఖ అధికారులు దాడి చేశారు. రీచ్‌లో ఉన్న రెండు టిప్పర్లు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించడంతో పాటు ఇసుక లోడ్‌చేసే యంత్రం తాళం కూడా స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ అధికారులు ఆర్ఐ స్వాతి, టీఏలు వాణిశ్రీ, వెంకటేశ్వర్లు తెలిపారు. భూగర్భ వనరుల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లపై దాడులు నిర్వహించినట్లు వారు చెప్పారు.



స్వాధీనం చేసుకున్న టిప్పర్లతో మైనింగ్ అధికారి

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లు తీసుకెళుతున్న మినీ లారీ బోల్తాపడ్డ సంఘటన మండలంలోని తెడ్డుపాడు బీసీ కాలనీ సమీపాన 565 జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన ఓ గ్యాస్ ఏజెన్సీ వాహనం తెడ్డుపాడు, వెంగన్నపాళెం గ్రామాల్లో సిలిండర్లు పంపిణీచేసి తిరిగి దుత్తలూరుకు వెళుతుండగా తెడ్డుపాడు బీసీ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ మల్లవరపు హజరత్‌రెడ్డికి గాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్రవాడ వైద్యశాలకు తరలించారు. వాహనం బోల్తాపడ్డ సమయంలో సిలిండర్లు చెల్లాచెదురుగా రోడ్డుపై పడడం, ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 440



క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా నగరంలో బుధవారం క్రైస్తవులు, ప్రజా సంఘాల నాయకులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. దేశ శాంతి భద్రతల కోసం నిరంతరం ప్రార్థించేవారు క్రైస్తవులని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలిచ్చారు.

న్యూస్ బాక్స్

సాయుధ దళాల నిధికి రూ.2.5 లక్షల విరాళం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీలో హవాల్దార్‌గా పని చేసిన వీఎస్ కృష్ణమూర్తి- సీతల కుమారుడు శ్రీనివాస శాస్త్రి జ్ఞాపకార్థం సైనిక సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.2.5లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో బుధవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత వీ సీత, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా టీ-20 మ్యాచ్‌లు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో బుజబుజ నెల్లూరులోని సీఐఏ క్రీడామైదానంలో జరుగుతున్న సింహపురి ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ మ్యాచ్‌లు పోటాపోటీగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం గ్రౌండ్ ఏలో జరిగిన మ్యాచ్‌లో గూడూరు రాయల్ చాలంజర్స్ జట్టు కావలి సన్‌రైజర్స్ జట్టుపై విజయం సాధించింది. గ్రౌండ్-బీలో జరిగి మ్యాచ్‌లో ఆత్మకూరు రేంజర్స్ జట్టుపై కోవూరు నైట్ రైటర్స్ జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం గ్రౌండ్-బీలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు సర్వేపల్లి సూపర్ జైంట్స్‌పై జయభేరి మోగించింది. గ్రౌండ్-ఏలో జరిగిన మరో మ్యాచ్‌లో సూళ్లూరుపేట స్పార్టెన్స్ నెల్లూరు సూపర్‌కింగ్స్‌పై ఉత్కంఠ విజయం నమోదు చేసింది.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు-2వ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు తెలిపేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9959225642 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

పోలీసులకు జగన్ క్షమాపణ చెప్పాలి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పోలీసులను బట్టలు ఊడదీసి నిలబెడతానంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పోలీసులకు క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసులు రాజకీయాలకు, వర్గాలకు, రాగ ద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తూ రూల్‌ఆఫ్‌లాను పారదర్శకంగా అమలు చేస్తున్నప్పటికీ జగన్ రాజకీయ లబ్ధికోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాస నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్, సింహపురి కాలనీ, మైపాడ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

అన్నదమ్ములపై దాడి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పానీపూరి తింటున్న అన్నదమ్ములపై అకారణంగా కొందరు దాడిచేసి గాయపరిచిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని ఉమ్మారెడ్డిగుంటకు చెందిన వల్లిఖాన్ తన సోదరుడు సయ్యద్‌తో కలిసి ఈ నెల 6వ తేదీ రాత్రి అదే ప్రాంతంలోని ఓ పాఠశాల సమీపంలో ఉన్న పానీపూరి బండి వద్దకు వెళ్లాడు. అక్కడ పానీపూరి తింటున్న సమయంలో సయ్యద్‌పై కొందరు దాడి చేస్తుండగా వల్లిఖాన్ అడ్డుకున్నాడు. దీంతో దుండగులు ఆ అన్నదమ్ములిద్దరిపై దాడి చేసి పరారయ్యారు. బాధితుడు బుధవారం వేదాయపాళెం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దోర్నాలకు అభినందనలు



హరిబాబును సన్మానిస్తున్న నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది కళారత్న (హంస) అవార్డు అందుకున్నందుకు దోర్నాల హరిబాబుకు బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో అభినందన సభ నిర్వహించారు. 25 కళాసంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అమరావతి కృష్ణారెడ్డి, విశాలాక్షి కోసూరు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

రూ.37 కోట్లతో మినీ డ్రైన్ల నిర్మాణం

- రూ.4.8 కోట్లతో 'ఎన్టీఆర్ సుజల స్రవంతి'
- రూ. 2కే 20 లీటర్ల మంచినీరు
- మంత్రి నారాయణ



క్యాంపు కార్యాలయంలో అధికారులు, నాయకులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మురుగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు రూ.37 కోట్లతో మినీ డ్రైన్లు నిర్మించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులతో సంయుక్తంగా సమీక్ష జరిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.11.75 కోట్లను తొలి విడతగా డ్రైన్ల నిర్మాణానికి కేటాయిస్తున్నట్లు తెలి పారు. మూడు విడతలుగా డ్రైన్లను నిర్మించి శాశ్వతంగా మురుగు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రూ. 4.8 కోట్లతో ఎన్టీఆర్ సుజల స్రవంతికి పథకానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. మదర్‌ప్లాంట్లు, డిస్పెన్సింగ్ యూనిట్లుగా వీటిని నిర్మించి రూ. 2కే 20 లీటర్ల తాగునీటిని అందిస్తామన్నారు. 54వ డివిజన్‌లో రూ.50లక్షలతో షాదీ మంజిల్ నిర్మాణానికి అనుమతులిస్తున్నట్లు తెలిపారు. ఇవికాక మరో రూ.17.7 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్దనున్న మహబూబ్‌ఖాన్ పార్కులో పిల్లల ఆటవస్తువులను మంత్రి ప్రారంభించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, అనురాధ పాల్గొన్నారు.

నిరుపయోగంగా జడ్పీ స్థలం

- ప్రతిపాదనలకే పరిమితమైన వాణిజ్య సముదాయ నిర్మాణం
- దృష్టి సారిస్తే నెలకు రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగర నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ పాత కార్యాలయం స్థలం నిరుపయోగంగా ఉంది. కోట్లాది రుపాయలు విలువ చేసే ఈ స్థలంలో కొన్నేళ్లగా ఎటువంటి ప్రభుత్వ కార్యకలాపాలు జరగడం లేదు.



నగరంలోని బార్కాస్ సెంటర్‌లో దశాబ్దాల క్రితం ఎకరా స్థలంలో జడ్పీ కార్యాలయం, పరిపాలన విభాగాలు, జడ్పీ గెస్ట్ హౌస్ నిర్మించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో నగరంలోని టీబీ ఆసుపత్రి ఆవరణకు మార్చారు. అక్కడ స్థలాన్ని కేటాయించడంతో నూతన భవనాన్ని నిర్మించారు. గత 15 ఏళ్లుగా జడ్పీ పాలన మొత్తం అక్కడి నుంచే జరుగుతోంది. దీంతో పాత కార్యాలయం నిరుపయోగంగా మారింది. అక్కడి గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరడంతో గత వైసీపీ ప్రభుత్వంలో దానిని కూల్చివేశారు.

● ప్రతిపాదనలకే పరిమితం

నగరంలో అత్యంత ఖరీదైన పాత జడ్పీ కార్యాలయ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాల్ తదితరాలు నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా వాణిజ్య సముదాయానికి సంబంధించిన ప్రతిపాదనలను గతంలో రూపొందించారు. అయితే అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. భారీగా నిధులు అవసరం కాగా గత ప్రభుత్వం నిధుల మంజూరుకు సుముఖత చూపించలేదు. జడ్పీ సొంత నిధులతో వాణిజ్య సముదాయం నిర్మించుకోవాలంటే గత ప్రభుత్వంలో కేవలం రూ.10 లక్షలు మాత్రమే జడ్పీకి నిధులు వినియోగించుకుని పనులు చేసే అధికారం ఉండేది. దీంతో అటు ప్రభుత్వ సహకారం లేక ఇటు జడ్పీ సొంత నిధులు వినియోగించలేక వాణిజ్య సముదాయం ప్రతిపాదనలకే పరిమితమైంది.

● మళ్లీ తెరపైకి...

జిల్లా పరిషత్ పాత కార్యాలయ స్థలాన్ని నిరుపయోగంగా వదిలివేయకుండా ఆదాయ మార్గంగా మార్చేందుకు కొత్త ప్రభుత్వంలో జడ్పీ అధికారులు, పాలకులు మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. వ్యాపారాలకు అనువైన ప్రాంతంగా జడ్పీ పాత భవనం ఉండడంతో ఆ స్థలంలో భారీగా దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తే నెలకు రూ.లక్షలాది రుపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దీనికితోడు కొత్త ప్రభుత్వంలో జడ్పీకి రూ.25 లక్షల మేర పనులు చేసుకునే అధికారాన్ని కల్పించడంతో దానిని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ సహకారంతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

హంసపై వేణుగోపాలుడు

నగరంలోని ఆలయాల్లో వైభవంగా ఉత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి హంస వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, అర్చనలు, విశేష పూజల అనంతరం సూర్యప్రభ వాహనంలో పేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విశేష పూలంగిసేవ, పూజలు జరిగాయి.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకాలు, పుష్పాలంకరణ, పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, స్వామివారికి జింక వాహనంపై పేట ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి.

● బాలాజీనగర్ సీతారామ మందిరంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, హనుమంత వాహనంలో పేట ఉత్సవం జరిగాయి.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న పంగున్యోత్తర కల్యాణ వేడుకల్లో తాయార్లకు ఉదయం తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి. రాత్రి తల్పగిరి రంగనాథ స్వామికి, తాయార్లకు ప్రాకారోత్సవం, ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగాయి.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో ఉదయం విశేష పూజలు, సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం పూలంగిసేవ, హంస వాహనంలో నగరోత్సవం జరిగాయి.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి గరుడసేవ వైభవంగా జరిగింది. ఉదయం తిరుమంజనం, ఊంజల్‌సేవ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● ఘనంగా సుందరేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉన్న మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సాయంత్రం కుంభ హారతులు, పల్లకీ సేవ జరిగాయి. సన్నపరెడ్డి పెంచలరెడ్డి, పద్మావతమ్మ, ఆల్తూరు సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

తల్లి ఆహారమే బిడ్డకు రక్ష : సీడీపీవో



పోషకాహార పక్షోత్సవంలో మాట్లాడుతున్న లక్ష్మీదేవి

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ సమయంలో తల్లి తీసుకునే ఆహారమే బిడ్డ ఆరోగ్యానికి రక్ష అని అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి చెప్పారు. బుధవారం నగరంలోని రాయపు హరిజన వాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పక్షోత్సవ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం అత్యంత ప్రధాన అంశంగా పేర్కొన్నారు. గర్భదారణ సమయంలో కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లి మానసిక ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు, అరుణమ్మ, జయలక్ష్మి, ముకుంద, వాణి, పద్మ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు పోషకాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వల్ల బిడ్డలకు అనేక పోషకాలు లభిస్తాయని అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ లక్షీరాజ్యం పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం పరిధిలోని జనార్ధనరెడ్డికాలనీలో బుధవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు జరిగాయి. ఇందులో పాల్గొన్న గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ రాధా, మాధవి, భాగ్యలక్ష్మి, రవణమ్మ, ఆదిశేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

13న శంఖారావం

- అవాజ్, ఇన్సాఫ్ కమిటీలు



శంఖారావం పోస్టర్ విడుదల చేస్తున్న అవాజ్, ఇన్సాఫ్ కమిటీల నాయకులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీలపై జరిగే దాడులకు నిరసనగా ఈ నెల 13న విజయవాడ సిద్ధార్థ కళాశాలలో సమ్మెకృత శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని అవాజ్, ఇన్సాఫ్ కమిటీలు పిలుపునిచ్చాయి. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆ కమిటీలు విలేకరుల సమావేశం నిర్వహించాయి. అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్ మాట్లాడారు. దేశంలో మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. సోషల్ మీడియాలోనూ మైనార్టీలను కించపరుస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వీడియోలు పోస్టు చేస్తున్నారని ఆరోపించారు. లౌకిక విలువలు కలిగిన ప్రతీ ఒక్కరు శంఖారావంలో పాల్గొనాలని కోరారు. ఈ సదస్సుకు రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరవుతారని తెలిపారు. అనంతరం శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ నాయకులు సయ్యద్ రఫూఫ్, సర్దార్ అహ్మద్, సిరాజ్, ఇన్సాఫ్ సభ్యుడు షాన్‌వాజ్ పాల్గొన్నారు.

నేడు మహావీర్ జయంతి

- నగరంలో జైనుల ప్రత్యేక కార్యక్రమాలు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : అహింసో పరమో ధర్మః అని ప్రబోధించిన 24వ తీర్థంకర మహావీర్ జయంతిని శుక్రవారం జైనులు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. నగరంలోని జైనులు మహావీర్ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకునేందుకు అన్నీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జైన దేవాలయాల్లో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. చాలా మంది జైనులు ఏదో ఒకరకమైన దానధర్మాలు చేయడం, ప్రార్థనలు, పూజలు, వ్రతాలు చేస్తారు. ర్యాలీలు నిర్వహిస్తారు. మహావీరుడు క్షత్రియ జైన్ కుటుంబంలో జన్మించారు. 30 సంవత్సరాల వయసులోనే అన్నీ త్యజించి సన్యసించారు. 12 సంవత్సరాలు ధ్యానం, తపస్సులో గడిపారు. ప్రజలకు ధర్మ బోధనలు చేశారు. ఆ మహావీరుని జయంతి సందర్భంగా నెల్లూరులో ఉదయం 6.30 గంటలకు జైన్ మందిరంలో అభిషేకాలు, 7 గంటలకు అన్నదా భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, 8.30 గంటలకు అహింసా ర్యాలీ జరపనున్నారు.

పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తాం

- కమిషనర్ సూర్యతేజ



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విధుల నుంచి తొలగిస్తామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం, అనుమతులు లేకుండా హాజరు వంటి చర్యలకు పాల్పడే వారిని పక్కనపెట్టాలని దిగువ అధికారులను ఆదేశించారు. రోడ్లపై చెత్త, కాలువల్లో పూడికతీత క్రమం తప్పక జరగాలని స్పష్టం చేశారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసేందుకు పూర్తి వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, ఎంహెచ్ వో చైతన్య, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ముందంజ

- జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. నగరంలోని 49వ డివిజన్ మెట్లరేవు రావిచెట్టు సెంటర్‌లో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు బుధవారం జనసేన పార్టీ నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కిషోర్ మాట్లాడుతూ మెగా పైపులైన్ ద్వారా ప్రజలకు ఉచితంగా మంచినీరు అందించేందుకు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా కాలువలు లేకుండా మురుగు నీరు పోయేందుకు ప్రత్యేక వ్యవస్థను మంత్రి నారాయణ రూపొందిస్తే గత వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించిందని విమర్శించారు. ఆ పనులు మళ్లీ ప్రారంభం అయ్యాయని, ఆరు నెలల్లో పూర్తి చేస్తారని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి, ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్, షేక్ యాసిన్, ఆబీద్, వసీం పాల్గొన్నారు.

కాలేయ మార్పిడిలో నూతన ఒరవడి

- డాక్టర్ రజనీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజనీకాంత్

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నై గ్లినిగల్ హెల్త్‌సిటీ ఆసుపత్రిలో కాలేయ మార్పిడిలో నూతన ఒరవడి తీసుకువచ్చినట్లు ప్రముఖ కాలేయ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ రజనీకాంత్ వెల్లడించారు. బుధవారం గ్లెనిగల్ హెల్త్‌సిటీ నెల్లూరు బ్రాంచి ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 50 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకు వయసున్న దాతల నుంచి కాలేయం సేకరించి సిర్రోసిస్ వల్ల కాలేయం దెబ్బతిన్న రోగులకు అమరుస్తున్నామన్నారు. మద్యపానం, ఊబకాయం, ఫాటీలివర్, హెపటైటిస్ వైరస్, జన్యుపరమైన కారణాల వల్ల కాలేయ వ్యాధులు సోకుతాయని తెలిపారు. కాలేయ మార్పిడి చేయించుకున్న సత్యనారాయణ, నరేంద్రరెడ్డి, మాధవి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ హర్షవర్ధన్ సమావేశంలో పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైన్ల పనుల పరిశీలన



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 32, 33 డివిజన్లలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, డ్రైన్ల పనులను బుధవారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. రూరల్లో 303 పనులను సుమారుగా రూ.50 కోట్లతో ఏకకాలంలో చేపడుతున్నామని చెప్పారు. కాగా, ప్రజాజీవితంలో ఖ్యాతి గడించిన మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటుకు నగరంలో స్థలం కేటాయించాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు లేఖ రాశారు. పెద్దాసుపత్రి వెనుక పొదలకూరురోడ్డులో ఉన్న ఐల్యాండ్‌ను కేటాయిస్తే అందులో తన సొంత ఖర్చులతో వివేకా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఆ లేఖలో పేర్కొన్నారు.

బ్యాంకింగ్ రంగంపై అవగాహన పెంచుకోవాలి

- కెనరా బ్యాంక్ ఏజీఎం ప్రదీప్ కుమార్




ఏజీఎం ప్రదీప్‌ను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన బ్యాంకింగ్ రంగం పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టీఎస్ ప్రదీప్ కుమార్ అన్నారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగంలోని తాజా ధోరణులు, ప్రజలకు అందిస్తున్న సేవలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అతిథిగా హాజరైన ప్రదీప్ బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, ఎంబీఏ డీన్ డాక్టర్ జీ ధనుంజయ్, విభాగాధిపతి డాక్టర్ జీ మాల్యాద్రి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కథనం
తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతికి సైన్స్‌సిటీ లేనట్టేనా?



ప్రతిష్ఠాత్మక సైన్స్‌సిటీని తిరుపతి కోల్పోతోందా? చంద్రబాబు ఆలోచనల్లోంచి పురుడుపోసుకుని తిరుపతిలో స్థల ఎంపిక కూడా పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆతర్వాత జగన్ ప్రభుత్వం అటకెక్కించింది. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ సైన్స్‌సిటీ పట్టాలెక్కుంతుందని అంతా ఆశపడ్డారు. అయితే ఏపీ సైన్స్‌సిటీని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్రప్రభుత్వం తాజాగా ప్రకటించడంతో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. తిరుపతితో పాటూ అమరావతిలో కూడా సైన్స్‌సిటీలు ఏర్పాటు చేస్తారా? లేక తిరుపతి బదులుగా అమరావతిలో ఏర్పాటు చేస్తారా అనే స్పష్టత లేకపోవడం అయోమయానికి దారి తీస్తోంది. గతంలో చంద్రబాబే స్వయంగా తిరుపతిలో ప్రకటించి, తనే శంకుస్థాపన చేసిన నేపథ్యంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



2017 జనవరి 4న అప్పటి సీఎం చంద్రబాబు సైన్స్ సిటీకి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఆగమేఘాలపై అలిపిరి దగ్గర 70 ఎకరాలు

సైన్స్‌సిటీ కోసం అనువైన భూముల కోసం అన్వేషణ మొదలైంది. తిరుపతిలో అలిపిరి సమీపంలో అప్పటికే రీజనల్ సైన్స్ సెంటర్, ఎస్వీ జూపార్కు ఉన్నందున ఈ ప్రాంతం ఉపయోగకరమని భావించారు. టీటీడీకి చెందిన 70 ఎకరాలను గుర్తించారు. సర్వే నంబరు 588-ఏలో 50.96 ఎకరాలు, సర్వే నంబరు 589లో 19.15 ఎకరాలు చొప్పున మొత్తం 70.11 ఎకరాలు ఏపీ సైన్స్ సిటీకి లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు టీటీడీ అంగీకరించింది. ఇందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం జీవోఎంఎస్ నంబరు 365ను 2017 ఆగస్టు 16న జారీ చేసింది. 2017 జనవరి 4న సీఎం చంద్రబాబు ఏపీ సైన్స్ సిటీకి శంకుస్థాపన కూడా చేశారు. ఇక్కడిదాకా ఆగమేఘాలమీద జరిగిన పనులు ఆ తర్వాత మందగించాయి. నిర్వహణ, నిధుల కేటాయింపునకు సంబంధించిన అంశాలపై కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. రెండేళ్ల పాటూ పనులు ముందుకు కదల్లేదు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

జగన్ ఎసరు పెట్టారు

2019 జూన్‌లో జగన్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే సైన్స్‌సిటీని అటకెక్కించే ప్రక్రియ మొదలైంది. సైన్స్‌సిటీ రద్దు అనే మాట అనకుండా దానికి కేటాయించిన భూములను తెలివిగా లాగేసుకున్నారు. ఆ ప్రాంతంలోనే అద్భుతమైన స్పిరిచ్యువల్ సిటీని నిర్మించబోతున్నామని టీటీడీ పాలక మండలితో అక్టోబరు 23న తీర్మానం చేయించారు. దీనికి 500 ఎకరాలు అవసరమని ప్రతిపాదించారు. సైన్స్‌సిటీకి కేటాయించిన 70.11 ఎకరాలు వెనక్కి తీసుకోవాలంటూ ప్రభుత్వాన్ని టీటీడీ కోరింది. అప్పటి టీటీడీ ఈవో జవహర్ రెడ్డి లేఖలతో వెంటబడడంతో ఏపీ సైన్స్ సిటీకి ఇచ్చిన భూముల భూముల కేటాయింపును వైసీపీ ప్రభుత్వం రద్దు చేస్తూ 2020 జూన్ 4న జీవోఎంఎస్ నంబరు 167 జారీ చేసింది. స్పిరిచ్యువల్ సిటీ నిర్మాణానికి ఈ భూములను కేటాయించారు.

చంద్రబాబు పురుడు పోశారు

తిరుపతిలో 2017 జనవరిలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. నోబెల్ గ్రహీతలు సహా దేశవిదేశాల నుంచీ శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన మహామహులంతా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఘనమైన ఆతిథ్యం ఇచ్చింది. అప్పట్లో సీఎం చంద్రబాబు మహాసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సైన్స్ సంబరాలను చూసిన చంద్రబాబు, రాష్ట్రంలో సైన్సు, సాంకేంతిక పరిశోశనలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో రెండు కీలక ప్రకటనలు చేశారు. అందులో ఒకటి.. ఏపీ నుంచి నోబెల్ గ్రహీత అయినవారికి రూ.పదికోట్ల నగదు బహుమతి ఇస్తామన్నది. రెండోది.. సైన్స్‌కాంగ్రెస్‌కి ఆతిథ్యం ఇచ్చిన తిరుపతి నగరంలో సైన్స్‌సిటీ నిర్మిస్తామన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు ఇది.

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయినందున సైన్స్‌సిటీ ఆశలు మళ్లీ ప్రాణం పోసుకున్నాయి. అయితే అలిపిరి సమీపంలో ముంతాజ్ హోటల్‌కి స్థల కేటాయింపు రద్దు చేసే క్రమంలో స్పిరిచ్యువల్ సిటీతో పాటూ సైన్స్‌సిటీ

తిరుపతి కోల్పోయినట్టేనా?

భూములు కూడా రద్దు చేసి టీటీడీకి అప్పగించనున్నట్టు సీఎం ఇటీవల తిరుమలలో ప్రకటించారు. అయితే ప్రత్యామ్నాయంగా తిరుపతిలో మరో వైపున సైన్స్‌సిటీకి భూములు కేటాయిస్తారని అంతా భావించారు. ఈలోగా ఏం జరిగిందోగానీ అమరావతి పేరు తెరమీదకు వచ్చింది. తిరుపతిలో ఏర్పాటు చేయదలచుకున్న ప్రాజెక్టునే అమరావతిలో ఏర్పాటు చేస్తారా? లేక తిరుపతిలోనూ అమరావతిలోనూ కూడా సైన్స్‌సిటీలు ఏర్పాటు చేస్తారా అనే స్పష్టత లేదు. చంద్రబాబు తిరుపతికి ఇచ్చిన హామీని మరచిపోరని, తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మక సైన్స్ సిటీని ఏర్పాటు చేస్తారనే నమ్మకం విద్యావేత్తలో మాత్రం ఉంది. చూడాలి.. ఏం జరుగుతుందో!

గాల్లోనే స్పిరిచ్యువల్ సిటీ

స్పిరిచ్యువల్ సిటీ పేరుతో మొత్తం 138.09 ఎకరాలను తిరిగి టీటీడీకి స్వాధీనం చేసిన వైసీపీ ప్రభుత్వం.. ఆ తర్వాత అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఎన్నడూ స్పిరిచ్యువల్ సిటీ ఊసే ఎత్తలేదు. ఆ ప్రాజెక్టు రూపు రేఖల గురించిన ప్రతిపాదన లేదు. టీటీడీనా.. ప్రయివేటు సంస్థలా.. ఎవరు నిర్మిస్తారో తేల్చలేదు. చంద్రబాబు తలపెట్టిన ప్రాజెక్టును అటకెక్కించేసిన ఆనందంలో ఉండిపోయారు. తిరుపతి అభివృద్ధి జపం చేసిన వైసీపీ నాయకులు కూడా నోరు మెదపలేదు.

సైన్స్‌సిటీలో ఏముంటాయి..?

- ఇందులో ఏడు భిన్నమైన మ్యూజియంలు ఉంటాయి. ఇవి సాధారణ ప్రజలకూ, విద్యార్థులకూ సైన్సు, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని కలిగిస్తాయి. అవగాహన పెంచుతాయి.
- బయో మెడికల్, ఫిజికల్ సైన్స్ పరిశోధనలకు ఉద్దేశించిన రీసెర్చ్ ఇన్నొవేషన్ క్లస్టర్ ఉంటుంది. దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రాతినిధ్యంతో ఇవి నడుస్తాయి.
- సైన్సు, సాంకేతిక విజ్ఞాన వ్యాప్తి కోసం ఒక ప్రత్యేక సముదాయం ఏర్పాటు చేస్తారు.
- ప్లానటోరియం ఏర్పాటు చేస్తారు.




హోటల్ నుంచి వస్తున్న కల్యాణ్‌రామ్ - విజయశాంతి

తిరుపతిలో 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'

అర్జున్ సన్నాఫ్ వైజయంతి.. సినిమా నటుడు నందమూరి కల్యాణ్‌రామ్, అలనాటి నటి విజయశాంతి, హీరోయిన్ సాయిమంజ్రేకర్ బుధవారం మధ్యాహ్నం తిరుపతికి వచ్చారు. తాజ్ హోటల్లో విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అరగంటపాటు అభిమానులతో కల్యాణ్‌రామ్ ఫొటోలు దిగారు. అనంతరం చిత్తూరు వెళ్లేందుకు బయటకు వచ్చిన విజయశాంతిని చూడగానే అభిమానులు, యువత కేకలతో హోరెత్తించారు. నటి సాయిమంజ్రేకర్ హోటల్ అంతరాళంలో ఉన్న పార్కులో అభిమానులతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం ఈ ముగ్గురూ చిత్తూరుకు బయలుదేరి వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



స్టైల్ ప్లీజ్.. సాయి మంజ్రేకర్ ఫొటో తీస్తున్న అభిమాని



బట్టలు ఉతుక్కోడానికే పనికొస్తారు

'బట్టలు విప్పదీసి కొడతానన్నారు. రాబోయే రోజుల్లో బట్టలు ఉతుక్కోడానికే మీరు పనికొస్తారు. ఇదిగో, ఈ ఏరియల్, సర్ఫ్ఎక్సెల్, రిన్ ప్యాకెట్లను లోటస్‌పాండ్‌కి, బెంగళూరు.. తాడేపల్లి ప్యాలెస్‌కు, పులివెందులకు పంపిస్తాం. నిన్ను, నీ పార్టీని గతేడాది రాష్ట్ర ప్రజలు బండకేసి ఉతికి.. ఆరేసి 11 స్థానాలకు పరిమితం చేసినా ఇంకా జ్ఞానం రాలేదు' అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుడ్డలు ఊడదీసి కొడతామంటూ పోలీసుల ఆత్మస్థైర్యం.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన జగన్, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పోలీసు సెక్యూరిటీ లేకుండా మీరు ప్రజల్లోకి రాగలరా అని ప్రశ్నించారు. పోలీసుల బట్టలు కాదు.. కొన్నిరోజులు పోతే మీ డ్రెస్సే మారుతుందని, ఓ ప్రత్యేకమైన నంబర్ కూడా మీకు వస్తుందని ప్రజలు అంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, పొనగంటి భాస్కర్, నవీన్‌రాయల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆంధ్రజ్యోతి

తాబేళ్ల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

చిల్లకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న తాబేళ్ల జాతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ బీచ్ వద్ద బుధవారం జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆలీవ్ రెడ్లీ జాతి తాబేళ్లను సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడే తాబేళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులతోపాటు మత్స్యకారులు, స్థానికులపైనా ఉందన్నారు. సముద్రంలో కొన్ని వేల కిలోమీటర్లు తాబేళ్లు ప్రయాణించి తీర ప్రాంతాలకు వచ్చి గుడ్లు పెడతాయన్నారు. వాటిని కాపాడుకుని తాబేళ్ల ఉత్పత్తి, పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అంతరించిపోతున్న తాబేళ్లను సంరక్షించుకుంటే వాటి ద్వారా మానవ మనుగడకు, ప్రకృతికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యసంపద ఉత్పత్తికీ తాబేళ్లు దోహదపడతాయని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ తెలిపారు. గుమ్మళ్లదిబ్బ బీచ్‌ను బెస్ట్ రిసార్ట్ ప్రాంతంగా మార్చుకునేందుకు కృషి చేద్దామన్నారు. తాబేళ్ల ఉత్పత్తికి కృషిచేస్తున్న అటవీశాఖ అధికారులకు జ్ఞాపికలు అందించి కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, అటవీశాఖ అధికారులు శ్రీనివాసులు, గోపి, రమణయ్య, జిందాల్ పరిశ్రమ ప్రతినిధి శ్రీనివాస్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, సతీష్‌యాదవ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలం శ్రీనివాస సత్రం వద్ద సముద్రంలోకి బుధవారం 150 తాబేళ్లను కలెక్టర్ వెంకటేశ్వర్ వదిలారు. ఈ ఆలీవ్‌రెడ్లీ తాబేళ్లతో జరిగే పర్యావరణ సమతుల్యంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు.



గుమ్మళ్లదిబ్బ వద్ద సముద్రంలోకి తాబేళ్లను వదులుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, అటవీశాఖ అధికారి వివేక్ తదితరులు

అతడి అక్రమార్జన రూ.2.7 కోట్లు

- ఏసీబీ సోదాల్లో తేలిందన్న అధికారులు
- పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య అరెస్టు
- రెండో రోజూ కొనసాగిన తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యకు ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. తమ సోదాల్లో ఇప్పటి వరకు అతడు 2,70,62,206 రూపాయలు అక్రమార్జనకు పాల్పడినట్లు తేలిందని బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా మహేశ్వరయ్య ఓ బిల్లు చెల్లింపునకు చిన్నగొట్టిగల్లు మండలం పాలెం గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డిని నగదు డిమాండు చేశారు. ఆయన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు గత ఫిబ్రవరిలో రంగంలోకి దిగారు. రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా మహేశ్వరయ్యను పట్టుకుని అరెస్టు చేశారు. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇటీవల బెయిల్‌పై వచ్చారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులను మహేశ్వరయ్య కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరులో మంగళవారం సోదాలు జరిపారు. బుధవారమూ కొన్నిచోట్ల ఈ తనిఖీలు జరిగాయి. తిరుపతి రూరల్ పేరూరులోని ఆయన ఇంట్లో మొత్తం ఒకటిన్నర కిలో బంగారం, కిలో వెండి, రూ.35 లక్షల బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రూ.ఎనిమిది లక్షల నగదు గుర్తించి.. సీజ్ చేశారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా పలుచోట్ల ఆస్తులకు సంబంధించి 20 నుంచి 25 డాక్యుమెంట్లను అధికారులు సీజ్ చేశారు. బంధువులు, స్నేహితులు బినామీలుగా పలు బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు గుర్తించిన వీరు.. త్వరలో వాటిని తెరిచేందుకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిగా నెలవారీ జీతం తక్కువగా ఉన్నా.. ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్ ఉన్నట్లు గుర్తించారు. అక్రమార్జనకు పాల్పడినట్లు తేలడంతో మహేశ్వరయ్యను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయన్ను మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించడానికి అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



మహేశ్వరయ్య

అవినీతి అధికారుల సమాచారమివ్వండి

అధికారులు ఎవరైనా లంచం అడిగితే తిరుపతి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయండి. అలాగే, ఆదాయానికి మించి ఆస్తులున్న వారి వివరాలనూ మా దృష్టికి తీసుకురండి. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. లంచం ఇస్తే కానీ పనులు చేయమని చెబుతున్న అధికారుల వివరాలు చెబితే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగినా 94404 41630 నెంబరులో ఏఎస్పీ విమలకుమారిని.. లేదా 94404 41690 నెంబరులో డీఎస్పీ జస్సి ప్రశాంతిని సంప్రదించండి. ప్రజల సహకారం ఉంటేనే అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవచ్చు.

- ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి

ఇండియన్ ఆర్మీరిక్రూట్ దరఖాస్తులకు
నేడు ఆఖరి గడువు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ రిక్రూట్ దరఖాస్తులకు గురువారంతో గడువు ముగియనుందని సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ బుధవారం తెలిపారు. జనరల్ డ్యూటీకి 10వ తరగతి పాస్, అగ్నివీర్, అగ్నివీర్ క్లర్కు, స్టోర్ కీపర్ టెక్నికల్‌కు ఇంటర్ లేదా ఐటీఐ లేదా పాలిటిక్నిక్ పాస్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్‌కు 8వ తరగతి నుంచి 10వ తరగతి పాసై ఉండాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9440573537, 7036428762, 0877-2286921లను సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా దూరవిద్య పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయని డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకున్నట్టు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు.

తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు

- దామినేడు వద్ద 34 ఎకరాల కేటాయింపు
- రూ.1,500 కోట్ల అంచనాతో ఏర్పాటుకానున్న అకాడమీ

తిరుచానూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని దామినేడు లెక్కదాఖలా సర్వే నెంబరు 193/9 నుంచి 207/21 వరకు ఉన్న 34.70 ఎకరాలు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేశారు. ఒలంపిక్స్ ప్రమాణాలతో 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించేలా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.1,500 కోట్లతో స్పోర్ట్స్ అకాడమీకి శాప్ రూపకల్పన చేసింది. శాప్ ఎండీ నుంచి బుధవారం జిల్లా యంత్రాంగానికి స్థల కేటాయింపుల కోసం ప్రతిపాదనలందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు కావాల్సిన భూమికి సంబంధించిన పత్రాలను రెండు మూడు రోజుల్లో శాప్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. కాగా, పలు అకాడమీలను ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారులూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు ఆమోదం లభించడం సంతోషంగా ఉందన్నారు.



దామినేడు వద్ద ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీకి కేటాయించిన స్థలం

ఏం ఉంటాయంటే..

దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు వేదికగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఉంది. ప్రస్తుతం తిరుపతిలో ఏర్పాటు కానున్న ఈ అకాడమీలో 500 సీట్ల సామర్థ్యంతో ప్రోకబడ్డీ, 500 సీట్ల సామర్థ్యంతో ఫుట్‌బాల్, హాకీ, జిమ్నాస్టిక్, ఖోఖో వంటి పలు అకాడమీలు ఏర్పాటు కానున్నాయి. రన్నింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అకాడమీలు ఏర్పాటు కాబోతున్నాయి.

ఒంటిమిట్ట కోసం లడ్డూలు సిద్ధం



ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమలలో శ్రీవారి లడ్డూలు సిద్ధం చేశారు. డిప్యూటీఈవో(జనరల్) శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారిసేవకులు 70 వేల లడ్డూలను బుధవారం సిద్ధం చేశారు. 11న ఒంటిమిట్టలో జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూను ప్రసాదంగా అందజేయనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు



కొల్లు రవీంద్ర - ప్రజ్ఞానంద సరస్వతి

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, పెను గొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్,దివ్వెల మాధురి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ భక్తి వెంకటయ్య ఉన్నారు. దర్శనం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్టలో రాష్ట్ర కార్యక్రమంగా జరగాల్సిన కళ్యాణోత్సవాలను గత ఐదేళ్లు నామమాత్రంగా చేశారని విమర్శించారు. తిరిగి అత్యంత వైభవంగా రాములవారి కల్యాణోత్స వాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు,వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,201

తలనీలాలు సమర్పించినవారు: 21,040





నాడు



నేడు

1970లో శ్రీవారి వసంతోత్సవం- ప్రస్తుతం ఇలా..

శ్రీహరి సేవకు.. తరలిరాద తనే వసంతం

● తిరుమలలో నేటి నుంచి వసంతోత్సవం

తిరుమలేశునికి సేవకు వనమే తరలిరానుందా..వేసవి నుంచి ఉపశమనం కలిగించనుందా.. శ్రీవారి వసంతోత్సవాల్లో అలాంటి దివ్యానుభూతి కలిగించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. వసంతఋతువులో మలయప్పస్వామికి జరిగే ఈ వేడుకను ఉపశమనోత్సవం అని కూడా పిలుస్తుంటారు. క్రీ.శ 1360 నుంచీ ఈఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు శాసనాధారముంది. చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేలా మూడురోజుల పాటు జరిగే వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వనమే దిగివచ్చిందా..

ఏటా వసంతోత్సవాలకు ఆలయం వెనుకభాగంలోని వసంతమండపాన్ని విశేషంగా అలంకరిస్తారు. శేషాచల అడవులను తలపించేలా పక్షులు, జంతువులు, వృక్షాలు, చెట్లు, పువ్వుల ఆకృతులతో తీర్చిదిద్దుతారు. ఉత్సవమూర్తులను కొలువుదీర్చే మండపాన్ని దాదాపు 250 కేజీల వట్టివేరుతో అలంకరిస్తారు. 600 కేజీల సంప్రదాయ పుష్పాలు, 10వేల కట్‌ఫ్లవర్స్‌తో సుందరంగా రూపొందిస్తారు. పచ్చని చెట్లు, పుష్పాలతో పాటు పలు రకాల పక్షులు,జంతువుల ప్రతిమలతో వనమే శ్రీవారి సేవకు తరలివచ్చిందా అనిపించేలా ఏర్పాట్లు చేశారు.

స్నపనంతో కన్నులపండువగా

గురువారం ఉదయం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్నపనతిరుమంజనాన్ని ప్రారంభిస్తారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహిస్తారు. తర్వాత ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపడతారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా స్నపనం చేపడతారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరిస్తారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

స్వర్ణరథంపై ఉత్సవర్ల అభయం

రెండవరోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈఉత్సవంలో మహిళా ఉద్యోగులు, భక్తులు గోవిందనామస్మరణలు చేస్తూ రథాన్ని లాగుతారు. గంట పాటు మాడవీధుల్లో వైభవంగా ఈవేడుకను నిర్వహిస్తారు. యథావిధిగానే వసంతమండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేస్తారు. వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.

యుగ పురుషుల దర్శనం

శనివారం శ్రీవారు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులతో కలిసి దర్శనమిస్తారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకిస్తారు. ఒకేవేదికపై సమస్త మూలవరులను ఒకేసారి దర్శనం కల్పించే అపురూప ఘట్టం సాక్షాత్కరిస్తుంది. అందుకే మూడవరోజు ఉత్సవంలో పాల్గొనేందుకు భక్తులు మక్కువ చూపుతారు. వసంతోత్సవాలు ముగిశాక మూడు యుగాల మూర్తులను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈమూడు రోజుల పాటు 'మేవా' అనే ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారు చేసి వితరణ చేయనున్నారు.

● నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

వ్యాధి మూలానికి మందు ఇదిగో



రోగికి కాదు.. రోగానికి చికిత్స అనే సూత్రంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉంది. దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులనైనా నయం చేయగల వైద్యప్రక్రియగా ప్రజలు విశ్వసిస్తారు. కొవిడ్ సమయంలో ఈ వైద్యానికి విశేష ఆదరణ లభించింది. తర్వాతా ఎక్కువమంది హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

హోమియో వైద్య విధానానికి పెరుగుతున్న ఆదరణ

దీర్ఘకాలిక రోగాలకూ పరిష్కారం



మంగళంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల

జిల్లాలో 11 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. తిరుపతిలోని పాత ప్రసూతి ఆస్పత్రి భవనంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో హోమియో వైద్యశాల నడుస్తోంది. గతంలో రోజుకు సుమారు 4 వేల మంది వరకు వైద్యం పొందే వారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపైంది. పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనం. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా హోమియోకు ప్రాధాన్యమిస్తూ ఆ ఆస్పత్రుల రూపురేఖలను మారుస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి రూరల్ పరిధిలో మంగళంలో పైలట్ ప్రాజెక్టు కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరుతో ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసింది.

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో చక్కటి పరిష్కారం లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మందుల ఖరీదూ తక్కువే. జలుబు, దగ్గు నుంచి మైగ్రేన్ తలనొప్పి, మహిళల్లో వచ్చే రుతుక్రమ రుగ్మతలకు, ఆర్థరైటిస్, వెన్నునొప్పి, చర్మ, శ్వాసకోశ వ్యాధులకు, దీర్ఘకాలిక అలసట, హార్మోన్లలో వ్యాత్యాసం, జీర్ణ రుగ్మతలకు, అలర్జీలకు హోమియోకు మించిన వైద్యం లేదని రోగులు చెబుతుంటారు. హోమియో మందు ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే ఎక్కువ కాలం ప్రభావం ఉంటుంది. వ్యాధి పునరావృతం కాదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో చేసిన మందులు కావడంతో చెడు ప్రభావాలు ఉండవు.

సురక్షితమైన వైద్యం



హోమియోను మించిన సురక్షితమైన వైద్యం ఇంకొకటి లేదు. మందులు ఆలస్యంగా పనిచేస్తాయనేది అపోహ మాత్రమే. వైద్యులు సూచించిన విధంగా వాడితే ఎంతటి వ్యాధికైనా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రధానంగా మహిళల్లో వచ్చే నెలసరి సమస్యల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు నివారణ మార్గముంది. హోమియో వైద్యానికి అలవాటు పడితే ఇక ఏ వైద్యప్రక్రియనూ ఇష్టపడరు.

- డాక్టర్ ఎం.ఎస్.ప్రసన్న లక్ష్మి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, హోమియో వైద్యశాల, మంగళం



తిరుపతిలో సప్తగిరి తల్లి అంత్యక్రియలు

తిరుపతిరూరల్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అంత్యక్రియలు బుధవారం తిరుపతిలోని గోవిందధామంలో నిర్వహించారు. తిరుపతి రూరల్‌మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్‌వీధిలోని నివాసం వద్ద ఆమె భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. సప్తగిరిని పరామర్శించారు.

మహిళా అధికారిని వేధించిన కేసులో ఫారెస్ట్ రేంజర్‌కు మూడు నెలల జైలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ ఫారెస్ట్ అధికారిని వేధించిన కేసులో రేంజర్‌కు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2023లో దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ అధికారిగా పనిచేస్తున్న ఎస్‌కే అస్మ తున్నీసాతో రేంజర్ బొడ్డు వరప్రసాద్‌రావు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేశారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి సూళ్లూరుపేట కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారించిన న్యాయమూర్తి అనిల్ కుమార్ నిందితుడు వరప్రసాదరావుకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ కేసు వాదించారు.

పారదర్శకంగా భూసేకరణ



● జేసీ శుభం బన్సల్

సత్యవేడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు కానున్న ఎల్‌జీ పరిశ్రమకు 360 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన 220 ఎకరాలను రైతులనుంచి సేకరిస్తుండగా, మిగిలిన భూములను శ్రీసిటీ నుంచి తీసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు మరో 2,580 ఎకరాలకు సంబంధించి భూసేకరణ కోసం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ప్రక్రియకూడా ప్రారంభమవుతుందన్నారు. భూసేకరణపై గ్రామ సభలుకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం మేరకు ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నరసింగాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన





అజయ్, నిఖిత (ఫైల్‌ఫొటో), శ్మశానం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన నిఖిత(17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పరువు హత్యగా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్, నిఖిత కొద్దికాలంగా ప్రేమించుకుంటున్నారు. నరసింగపురానికి పొరుగున ఉన్న మిట్టపాలెం పంచాయతీ కొత్తూరు హరిజనవాడలోని తన అవ్వ ఇంటికి ఈ యువకుడు తరచూ వచ్చేవాడు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. ఈ విషయం తెలిసి నిఖిత తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అజయ్‌పై పోలీసులు పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారు. జైలులో ఉన్న అజయ్‌ను చూసేందుకు తరచూ నిఖిత వెళ్లడం తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. నెల క్రితం బెయిల్‌పై అజయ్ విడుదలయ్యాడు. అజయ్‌తో నిఖిత మళ్ళీ మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈనేపథ్యంలో గత శుక్రవారం ఇంట్లో నిఖిత మృతి చెందింది. గంటల వ్యవధిలోనే ఈమె మృతదేహానికి దహనక్రియలు నిర్వహించారు. ఆమె మృతి ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బుధవారం డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి సిబ్బంది నరసింగాపురం గ్రామానికి వెళ్ళి మృతురాలి తల్లిదండ్రులను విచారించారు. దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. దీనిపై సీఐను వివరణ కోరగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆ మాటలేంటి జగన్?

● ఇకనైనా శవరాజకీయాలు మానుకో అన్న మంత్రి కొల్లు



తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులను బట్టలూడదీసి కొడతానని వైసీపీ అధినేత జగన్ బెదిరించడం చూస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అధికారులను భయపెట్టేలా మాటలేంటంటూ మండిపడ్డారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఆయన.. ఇప్పుడు అదే పోలీసులు రక్షణగా వస్తే వారిని అవమానపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే జగన్ బయటకు వచ్చేఆరు కాదన్నారు. వైసీపీ హయాంలో ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా తమను హౌస్ అరెస్టులు చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడలా చేయడం లేదన్నారు. వైసీపీలో జరిగిన అక్రమాలపై లోతైన విచారణ జరుగుతోందని, అందుకే ఆలస్యం కావచ్చేమోగానీ ఎవరూ తప్పించుకోలేరన్నారు. కేసుల్లో ఉన్నవారు ముందుగానే బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నారంటే వారి ప్రమేయం ఉంటుందన్న అనుమానం కలుగుతోందన్నారు. అనంతపురం జిల్లాలో ఒక కుటుంబ తగాదాల్లో చనిపోయిన వ్యక్తిని శవ రాజకీయం చేశారని విమర్శించారు. ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి ఏపీలో శాంతిభద్రతలు లేవని నానా యాగీ చేసిన జగన్.. ఇప్పుడు శవరాజకీయాలు ఎత్తుకున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఏపీ రెండోస్థానంలో నిలవడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో జీడీపీ పూర్తిగా పడిపోతే దానిని పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తమ వర్గం కౌన్సిలర్లతో ఎంపీ గురుమూర్తి, రాంకుమార్‌రెడ్డి తదితరులు

భానుప్రియపైనే విశ్వాసం

● మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై మెజారిటీ కౌన్సిలర్లు విశ్వాసం ప్రకటించారు. వైసీపీకే చెందిన దొంతు శారద వర్గం 16 మంది కౌన్సిలర్లతో గత నెల 26వ తేదిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అవిశ్వాస తీర్మానంపై వినతి పత్రం అందించారు. ఈ క్రమంలో బుధవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. ఈ మధ్యలో వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను బుజ్జగించారు. మొత్తం 19 మందిని క్యాంప్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, 10.30 నుంచి 12గంటల మధ్య అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా ప్రొసీడింగ్ అధికారిగా నిర్వహించారు. 11గంటలకు 19 మంది కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చారు. వీరు వైసీపీకే చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు అనుకూలంగా మద్దతు తెలిపింది. కాగా, దొంతు శారద వర్గం సమావేశానికి రాలేదు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, ప్రత్యేక పోలీసు సిబ్బంది పటిష్టమైనా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి

● అక్రమ మద్యం కట్టడి చేయాలన్న మంత్రి కొల్లు

● తిరుపతిపై ఫోకస్ పెంచాలన్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులున్నాయి. ఇక్కడ నిఘా పెంచండి. గంజాయి, నాటుసారా, మాదక ద్రవ్యాలు రాకుండా పూర్తిగా కట్టడి చేయాలి' ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం జరిగిన ఎక్సైజ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తిరుపతిలో ఎక్కువగా విద్యాసంస్థలు ఉన్నందున ఇక్కడ ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా చూడాలి' అని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు నిషాంత్‌కుమార్, రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 70 సారా తయారీ కేంద్రాలను గుర్తించామని అక్కడ పూర్తిగా కనిపించకుండా చేయడానికి తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వివరించారు. అవి కూడా లేకుండా గట్టిగా పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డీసీ విజయశేఖర్, ఎక్సైజ్ ఈఎస్‌లు నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, డిస్టలరీ ఈఎస్ జానకిరాం, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, అన్ని జిల్లాల డీసీలు, ఈఎస్‌లు, ఏఈఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో విన్నమాల పంటకాలువ



ఆక్రమణలతో కుచించుకుపోయిన విన్నమాల పంటకాలువ

నాయుడుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని విన్నమాల పంట కాలువ ఆక్రమణలతో కుచించుకుపోతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఏ సాగరం వద్ద స్వర్ణముఖినది నుంచి ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ బీడీ కాలనీ, టీచర్ కాలనీ, పాత ట్రెజరీ ఏరియా, పొగగొట్టం కాలనీ, రజక కాలనీ, ఆకుతోటవీధి, ఎల్‌బీసీ, ఆర్యాగం నగర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు నీరు అందిస్తుంది. దాదాపు 110 లింకుల వెడల్పుతో ఉండాల్సిన విన్నమాల పంటకాలువ ఆక్రమణలతో 35 అడుగుల మేర కుచించుకుపోయింది. విన్నమాల పంటకాలువ పూర్తిగా మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విన్నమాల పంటకాలువను మున్సిపాలిటి, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. కాలువ ఆక్రమణలను తొలగించి రూ.58 కోట్లతో ఆధునికీకరించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విన్నమాల పంటకాలువ ఆక్రమణలను తొలగించి పొలాలకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చిన్నారుల అస్వస్థతపై పీడీ విచారణ

అంగన్వాడీ వర్కర్, ఆయా సస్పెన్షన్



గ్రామస్తులను విచారిస్తున్న ఐసీడీఎస్ పీడీ వసంతబాయి

పెళ్లకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ కానూరు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటనపై ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత బాయి విచారణ చేపట్టారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆమె అంగన్వాడీ వర్కర్, ఆయాలతో పాటు చిన్నారుల తల్లిదండ్రులను, గ్రామస్తులను విచారించారు. గత 20 ఏళ్లుగా ఇక్కడ ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగకపోవడం వల్ల ఇది మొదటి తప్పుగా పరిగణలోకి తీసుకుని అంగన్వాడీ వర్కర్‌జీ శ్రీదేవితో పాటు ఆయా రాఘమ్మను సస్పెండ్ చేశారు. మళ్లీ ఇటాంటి ఘటనలు పునరావృత్తం అయితే ఉద్యోగం నుంచి తొలిగిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతులకు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం విషయంలో వర్కర్లు, ఆయాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, చెంబేడు వైద్యులు చంద్రమోహన్, రియాజ్ ఇద్రైతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి డంపింగ్ యార్డు మంటలు



డపింగ్ యార్డులో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో మంగళవారం ప్రమాదవశాత్తు సంభవించిన మంటలను అధికారులు అతికష్టం మీద బుధవారం అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగిన వెంటనే మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సిబ్బందితో అక్కడకు చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, హైవే సిబ్బంది, షార్ అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. పక్కనే ఉన్న కాళంగి నదిలో మోటర్లు ఏర్పాటు చేసి ఫైర్ ఇంజన్ల సాయంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు డంపింగ్ యార్డులో నీటిని చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. కాలిన చెత్తను ఎక్స్‌కవేటరు సాయంతో తొలగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. డంపింగ్ యార్డు పట్టణ నడిబొడ్డులో ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం స్థల కేటాయిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ కమిషన్ చెప్పారు.

ఓజిలి - పండ్లూరు రోడ్డుకు మరమ్మతులు



తారు మిక్స్‌ను చదును చేస్తున్న రోడ్డు లోలర్

ఓజిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ నుంచి పండ్లూరు క్రాస్ రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. పెద్దపరియ క్రాస్ నుంచి పండ్లూరు క్రాస్ వరకు 4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.25 లక్షలతో తారు రోడ్డు పనులు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ చెన్నరాయుడు తెలిపారు. గత రెండు రోజులుగా రహదారిలో ఏర్పడిన గోతులను పూర్తిగా తొలగించి వెట్‌మిక్స్ వేసి మరమ్మతులు చేస్తున్నారు.

అవిశ్వాసం నిలబడదని ముందే చెప్పా: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో అవిశ్వాస తీర్మానం నిలబడదని ముందే చెప్పానని వైసీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వెంకటగిరిలో టీడీపీ కౌన్సిలర్లు లేకపోయినా మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని చూశారని, తమ పాచికలు పారకపోవడంతో కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని కలెక్టర్‌ను టీడీపీ నాయకులు కోరారని గుర్తుచేశారు. అవిశ్వాసం నిలబడదని తెలియడంతో కౌన్సిలర్లు అందరూ వైసీపీ వాళ్లేనని, టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అలివిగాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. 2027లో జమిలి ఎన్నికలు జరిగి వైసీపీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. అనంతరం విజయోత్సవం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నక్కా వెంకటేశ్వర రావు, వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, కొండూరు వెంకటరత్నం రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 3 నుంచి 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శుభకర్‌రావు కోరారు. 3వ తరగతిలో 80, 4లో 78, 5లో 72, 6లో 59, 7లో 22, 8లో 1, 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు 6309089327 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బస్సుల ప్రారంభం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు వచ్చిన రెండు కొత్త బస్సును స్థానిక బస్టాండు వద్ద బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగానే సూళ్లూరుపేట డిపోకు అదనంగా రెండు కొత్త బస్సులను తీసుకొచ్చామన్నారు. సూళ్లూరుపేట నుంచి హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై నగరాలకు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జున, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.





గోతులమయంగా ఉన్న పోటుపాళెం రోడ్డు - రాళ్లు తేలిన విందూరు రోడ్డు

గుంతలు పడి... కంకర తేలి

- గోతులమయంగా గ్రామీణ రోడ్లు
- ప్రయాణికుల అవస్థలు

గూడూరు, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు గోతులమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లు గోతులు పడి, రాళ్లుతేలడంతో రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గూడూరు నుంచి మిటాత్మకూరు గ్రామానికి వెళ్లే 15 కిలోమీటర్ల రోడ్డు పలు గ్రామాల వద్ద గోతుమయంగా, రాళ్లు తేలింది. ఈ రోడ్డు ద్వారా వేములపాళెం, రామలింగాపురం, విందూరు, సంతదానుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరుగ్రామాల ప్రజలు గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిపూట ప్రయాణించే వాహనదారులు గోతులు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాకుండా విందూరు, వేములపాళెం తదితర గ్రామాల సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గూడూరు నుంచి పోటుపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు కూడా గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు మండలం చవటపాళెం నుంచి దివిపాళెం వెళ్లే మార్గంలో రోడ్డును అభివృద్ధి పరచకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొనిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా గ్రామీణ రోడ్లను అభివృద్ధి పరచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





దిమ్మెలస్థాయిలో ఆగిపోయిన మీజూరు చెక్‌డ్యామ్ - అసంపూర్తిగా ఉన్న వేలికాడు చెక్‌డ్యామ్

తీర ప్రాంతంలో సాగునీటి కష్టాలు తీరేదెన్నడో..!

ఏళ్ల తరబడి అసంపూర్తిగా చెక్‌డ్యామ్‌లు ● బీడుగా తీర ప్రాంత భూములు

దొరవారిసత్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పులికాట్ తీరంలో ఏడువేల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి ఐదు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి పునాది వేశారు. దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల పరిధిలోని పులికాట్ ప్రాంతంలో మీజూరు వద్ద రెండు, వేలికాడు, కారికాడు, బురదగాలికొత్తపాళెం వద్ద ఒక్కొక చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితులు మారడంతో పనులు ప్రారంభించలేదు. 1998లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.8 కోట్ల అంచనాలతో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను తిరిగి ప్రారంభించారు. 2004వరకు నత్తనడకన పనులు సాగుతూ వచ్చాయి. మీజూరు వద్ద నిర్మించిన రెండు చెక్‌డ్యామ్‌లలో ఒకటి 50శాతం మేర పనులు పూర్తి చేశారు. మరోకటి గోడలకే పరిమితం అయింది. ఈ చెక్‌డ్యామ్‌ల దిగువ ప్రాంతంలో చేపట్టిన వేలికాడు వద్ద చెక్‌డ్యామ్ పునాదుల్లోనే ఆగిపోయింది. కారికాడు వద్ద కరకట్టలతోనే నిలిపేశారు. అలాగే చిట్టమూరు మండల పరిధిలో బురదగాలికొత్తపాళెం వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ ఎగువ ప్రాంతంలో కట్టిన చెక్‌డ్యామ్‌లు పూర్తికాకపోవడంతో వర్షపునీరు సముద్రం పాలవుతోంది. ఈ ఐదు చెక్ డ్యామ్‌లను పూర్తిచేస్తే తీరప్రాంతంలో సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలున్నాయి. దొరవారిసత్రం మండలంలో మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలు, చిట్టమూరు మండలంలో మరో ఐదు గ్రామాల రైతులకు సాగునీరు చేరి లబ్ధి చేకూరుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చెక్‌డ్యామ్‌లు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మరో రూ.4కోట్లు వరకు ఖర్చు చేస్తే అసంపూర్తిగా ఉన్న చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తవుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెక్‌డ్యామ్‌లను పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేపు కోట మండల మీట్

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో గోపీ బుధవారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

హంస వాహనంపై శ్రీరాముడు



గూడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి మిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి చొప్పరం ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని హంస వాహనంపై అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. వెంకటరమణయ్య, శైలజ కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

గూడలిలో పోషణ్ పక్వాడా



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ కవిత

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి దక్షిణపాలెం, కోట దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు మొదటి 1000 రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యమైన జీవనశైలి, ఉబకాయం ఉన్న చిన్నారులకు ఇవ్వాల్సిన ఆహారం తయారుచేసే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీమంజుల, కోటేశ్వరి, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, కిషోర్, అలవల శ్రీనివాసులు, కొండలరావు, బీజేపీ నాయకుడు ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడలిలో భృంగి వాహనసేవ



కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు భృంగి వాహనంపై ఊరేగారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గోవిందపల్లిపాళెంలో సాగర కవాతు



గోవిందపల్లిపాళెం సాగరతీరంలో నిఘాలో ఉన్న పోలీసులు

కోట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రతీరంలో బుధవారం పోలీసులు సాగర కవాతు నిర్వహించారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సాగర తీరానికి వస్తున్న స్టీమర్లు, బోట్లు, మరపడవలను తనిఖీ చేశారు. బయటప్రాంతాల నుంచి అక్రమ కార్యకలాపాలు జరగకుండా తీరం వెంబడి నిఘా పెంచారు. ఆయా సముద్రతీర గ్రామాల్లోని మత్స్య కారులకు అవగాహన కల్పించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ హరిప్రసాద్

గూడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో డాక్టర్ హరిప్రసాద్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, రామ్మోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, నిమ్మకాయల రవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మెహబూబి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో మెహబూబి అన్నారు. బుధవారం మండలంలోని మంగళపూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణవాటిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడం వల్ల పోషక విలువలు పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూపారాణి, జీవనజ్యోతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో తొమ్మిది మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నేడు, ఎల్లుండి పలు రైళ్ల రద్దు

తడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కవరపేట - పొన్నేరి మధ్య సిగ్నల్ వ్యవస్థ, పట్టాల మార్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం, శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రైళ్ల రాకపోకలను నిలిపివేస్తారు. సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి నెల్లూరుకు వెళ్లే మెమో(66037) రైలు, నెల్లూరు నుంచి సాయంత్రం 6.45 నిమిషాలకు బయలుదేరి సూళ్లూరుపేటకు వచ్చే మెమో(66038) రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే సూళ్లూరుపేట నుంచి చెన్నైకు ఉదయం 11.45, మధ్యాహ్నం 3.10 నిమిషాలు, రాత్రి 9 గంటల వెళ్లే రైళ్లు రద్దు కాగా చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 నిమిషాలకు వచ్చే సబర్బన్ రైళ్లు రద్దు అయ్యాయి. మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశామని రైల్వే అధికారులు వెల్లడించారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: విజయశ్రీ



ఎమ్మెల్యేకు అర్జీ ఇచ్చి సమస్యను వివరిస్తున్న ఉచ్చూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు వెంకటరమణ, పక్కన టీడీపీ నేత చిరంజీవి తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు అందజేసే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పలు సమస్యలపై దాదాపు 40 అర్జీలు వచ్చాయి. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు బస్సును నిలిపివేశారని, రోడ్డుకు మరమ్మతులు చేసి బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని నీటి సంఘ అధ్యక్షుడు పామంజి వెంకటరమణ గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేకి అర్జీ అందజేశారు. గ్రామంలో తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, శ్రీనివాసుల నాయుడు, తిరుపాల్, గురుకల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వీధి మొత్తం మురుగే!



మురుగునీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

నాయుడుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని పాత ట్రెజరీ ఆఫీసు ఎదురుగా ఉన్న సిమెంట్ రోడ్డు మొత్తం మురుగునీటితో నిండిపోయింది. ఈ ప్రాంతంలో నివాసాలతో పాటు, ఉన్నత పాఠశాల ఉంది. విద్యార్థులు ప్రతిరోజు మురుగు నీటిలోనే నడుచుకుంటూ పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వీధిలో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని స్థానికులు అనేక పర్యాయాలు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ పాత ట్రెజరీ ఆఫీసు సిమెంట్ రోడ్డులో మురుగునీరు నిల్వ చేరకుండా చర్యలు చేపడతామన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులతో డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం తరఫున ఎన్‌బీకేఆర్ విద్యార్థులు చందన, చందు, వంశీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, బిందుమాధవ్, మాధవరాజు, వెంకటహావేష్, ఇందువర్షిణి, ప్రసాద్, మనోహర్‌రెడ్డి, మహేంద్రర్, గాయత్రి, చందన, ఆవుల చందు, శ్రావన్‌కుమార్, అలెక్స్ మాణిక్యం, కృష్ణారెడ్డి పలు క్రీడల్లో ప్రతిభ చూపారని తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడాకారులను డైరెక్టర్, విభాగాధిపతులు అభినందించారు.